

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 20 ఫిబ్రవరి 2022 సంపుటి : 03 సంచిక : 167 పేజీలు : 4 వెల : రూ 3-00


# సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిన జగన్

పదవుల కేటాయింపుల్లో సామాజిక న్యాయం
అన్నివర్గాలకుపదవుల కేటాయించిన ఘనత
పదవుల్లోప్రాధాన్యంపై వైసిపి నేతల విశ్లేషణ

అమరావతి,ఫిబ్రవరి19 : రాజ్యాధికారంలో అట్టడుగు వర్గాలకు సింహ భాగం ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. రానున్న కాలంలో రాజకీయ పదవుల్లో సైతం తమ వాటా సాధించుకునే స్థాయికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నుంచి నాయక త్వాన్ని తీర్చిదిద్దేలా చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. అన్ని పదవుల్లోనూ సగానికి పైగా మహిళలకు అవకాశం కల్పించి మహిళా సాధికారతకు అసలైన నిర్వచనం చెప్పారని కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో.. మంత్రివర్గ కూర్పు నుంచి కార్పొరేషన్ డైరెక్టర్ల వరకు నిజాయితీ, నిబద్ధతతో సామాజిక న్యాయాన్ని అమలు చేసి చూపించారన్నారు. 47 కార్పొరేషన్లకు సంబంధించి 481 మంది డైరెక్టర్లలో వీరిలో 248 మంది డైరెక్టర్లలో 52 శాతం పదవులను మహిళలకే ఇచ్చి అగ్రపీఠం వేశామని చెప్పారు. మహిళా పక్షపాత ప్రభుత్వం అని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. పురుషులకు 233 డైరెక్టర్ల పదవుల్లో 48 శాతం పదవులు ఇచ్చామని, మొత్తం డైరెక్టర్లలో 58 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇవ్వగా.. 42 శాతం పదవులు ఓసీలకు ఇచ్చామని వివరించారు. వైఎస్ జగన్ 2019లో అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని విషయాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్దపీట వేశారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే అని, అసెంబ్లీ స్పీకర్ కూడా బీసీనే అని చెప్పారు. మండలి అధ్యక్షుడు కూడా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులు, నామినేషన్ విధానంలో ఇచ్చే పనుల్లో చెప్పిన దానికంటే మిన్నగా ఇస్తున్నారని తెలిపారు. సచివాలయాల ఉద్యోగుల్లో 83 శాతం ఆ వర్గాలకు చెందిన వారున్నారని, ఆ వర్గాలలో ఒక విశ్వాసం పాదుకొల్పేందుకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిబద్ధతతో కృషి చేస్తోందని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని సజ్జల అన్నారు. బీసీల కోసం ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్మన్ల పదవులు, 137 నామినేటెడ్ పోస్టుల్లో సగానికి పైగా పదవులు ఈ వర్గాల వారికే ఇచ్చామని చెప్పారు. 31 లక్షల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇస్తే, వారిలో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారున్నారని వివరించారు. సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ వెతికి మరీ అభ్యర్థులను ఎంపిక చేశామని సజ్జల తెలిపారు. కొన్ని కులాల్లో అలా వెతకాల్సి వచ్చిందని, ఇందుకోసం భారీ కసరత్తు చేశామని చెప్పారు. చెప్పిన మాట నిలబెట్టుకుంటూ ఆయా వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రతి కార్పొరేషన్‌లో మహిళలకు సగానికి పైగా పదవులు ఇచ్చామన్నారు. టీడీపీ కేవలం మాటలే చెప్పిందని.. బీసీ, ఎస్సీలను అస్సలు పట్టించుకోలేదని విమర్శిం చారు. చంద్రబాబు ఎప్పుడూ బీసీల తోకలు కత్తిరిస్తానని, తోలు తీస్తానని చులకనగా చూసేవారని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో సామాజిక న్యాయం చూపిస్తున్నారని అన్నారు. సీఎంకు సామాన్యుడికి మధ్యలో ఎవరూ లేకుండా నేరుగా సంక్షేమ పథకాల లబ్దిని అందిస్తున్నారని చెప్పారు. ఏది చేయగలమో అదే చెప్పాలని, చెప్పింది చేయాలని ఆచరించి చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్ ఈ దేశానికి ఒక మార్గదర్శిగా నిలుస్తున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఈరోజు ఒక భరోసా లభించిందని చెప్పారు. ఈ వర్గాలకు



వివిధ పథకాల ద్వారా రూ.లక్షా 40 వేల 438 కోట్ల మేర లబ్ది కలిగిందన్నారు. అంబేద్కర్ కోరుకున్న పాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అణచివేతకు గురయ్యారని, సీఎం వైఎస్ జగన్ మాత్రం ఆ వర్గాలకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

# ఛత్రపతి అసమాన పోరాట వీరుడు



మొఘలులకుముచ్చెమటలు పట్టించిన నేత
నమ్మిన సిద్దాంతం కోసం నిరంతరంగా పోరాడారు
నివాళి అర్పించిన ప్రధాని మోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్య

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19 మరాఠా సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ తరతరాలకు స్ఫూర్తి ప్రదాత అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన అసాధారణ నాయకత్వం, సాంఘిక సంక్షేమం పట్ల ఆయన వైఖరి అనేక తరాల ప్రజలకు ప్రేరణనిస్తాయన్నారు. ఛత్రపతి శివాజీ జయంత్యుత్స వాల సందర్భంగా మోదీ శనివారం ట్విటర్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ దార్శనికతను, స్వప్నాన్ని సాకారం చేయడం కోసం తన ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సత్యం, న్యాయం విలువల కోసం ఆయన దృఢ వైఖరితో నిలిచారని కొనియాడారు. న్యాయం విషయంలో శివాజీ ఎన్నడు కూడా రాజీపడలేదని అన్నారు. ఆయన విశిష్ట నాయకత్వం, సాంఘిక సంక్షేమానికి ఇచ్చిన ప్రాధాన్యత తరతరాలుగా ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. శివాజీ ఆశయాన్ని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 1630లో జన్మించిన శివాజీ.. తన శౌర్యం, సైనిక మేధావి, నాయకత్వానికి గుర్తింపు పొందాడని, ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా నమస్కరిస్తున్నానని మోడీ ట్వీట్ చేశారు. శివాజీ న్యాయం, సత్యం విలువల కోసం నిలబడే విషయంలో రాజీపడలేదన్నారు. యావత్ భారత జాతి గర్వంగా చెప్పుకొనే ధీరుడు, వీరత్వానికి ప్రతీకగా కొలుచుకునే వీరుడు ఛత్రపతి శివాజీ అని, పుట్టుకతోనే వీరత్వాన్నిపుణికిపుచ్చుకున్న శివాజీ గొప్ప యోధుడన్నారు. మరాఠా రాజ్యాన్ని స్థాపించి మొఘల్ చక్రవర్తులను ఎదిరించి వారి సామ్రాజ్యాన్ని తన హస్తగతం చేసుకున్నారని మోడీ అన్నారు. మొఘలులను గడగడలాడించి ఆనాడే సమానత్వ సాధనకు ఛత్రపతి శివాజీ ఎంతో కృషి చేశారని, హిందుత్వాన్ని అనుసరిస్తూ అనుక్షణం ప్రజాసంక్షేమం కోసం పాటుపడ్డారని అన్నారు. ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు కూడా ఛత్రపతి శివాజీ మహరాజ్‌కు నివాళులర్పించారు. మరాఠా యోధుడు, సుప్రసిద్ధ మహారాజు ఛత్రపతి శివాజీకి ఆయన జయంత్యుత్సవాల సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన సాటిలేని ధైర్యసాహసాలకు ప్రతీక అని, అసాధారణ యుద్ధ వ్యూహాలకు ప్రసిద్ధి చెందినవారని కొనియాడారు. ఆయన ఆధునిక భావాలుగల పరిపాలకుడని పేర్కొన్నారు. మాతృభూమి పట్ల ఆయన ప్రదర్శించిన ప్రేమాభిమానాలు ప్రతి భారతీయునికి ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. ఆయనకు గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా నివాళులర్పించారు.

# అసియాలో అతి పెద్ద గోబర్-ధన్ ప్లాంట్‌ను ప్రారంభించిన మోదీ



ఇండోర్ : ఆసియాలో అతి పెద్ద గోబర్-ధన్ (బయో-సీఎన్‌జీ) ప్లాంటును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఇండోర్‌లో ఉన్న ఈ ప్లాంటును వర్చువల్ విధానంలో ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, ఇళ్లు, జంతువులు, సాగు భూముల నుంచి వచ్చే తడి వ్యర్థాలు ఓ విధంగా గోబర్ (ఆవు పేడ) ధనమని చెప్పారు. రానున్న రెండేళ్ళలో 75 మేజర్ మునిసిపాలిటీల్లో ఇటువంటి గోబర్ ధన్ బయో సీఎన్‌జీ ప్లాంట్ల నిర్మాణానికి కృషి జరుగుతోందని చెప్పారు. మన దేశంలోని నగరాలు పరిశుభ్రంగా మారడానికి ఇవి దోహదపడతాయన్నారు. వీటి వల్ల నగరాలు కాలుష్య రహితం అవుతాయని, పరిశుద్ధ ఇంధనం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం, మునిసిపల్ ఘన వ్యర్థాల ఆధారిత గోబర్ ధన్ ప్లాంట్లను స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0లో భాగంగా నిర్మిస్తున్నారు. నగరాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వీటిని నిర్మిస్తున్నారు. ఇది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలల ప్రాజెక్టు. వేరుపరచిన సేంద్రియ తడి వ్యర్థాలను ఈ గోబర్ ధన్ ప్లాంటు శుద్ధి చేస్తుంది. దీనిలో రోజుకు 550 టన్నుల వ్యర్థాలను శుద్ధి చేసి, దాదాపు 17,000 కేజీల సీఎన్‌జీని, 100 టన్నుల కంపోస్టును ఉత్పత్తి చేయవచ్చు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. ఆర్గానిక్ కంపోస్టు (సేంద్రియ ఎరువు)ను ఎరువుగా అందజేయడానికి వీలవుతుంది.

# సీఎం జగన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు





విజయవాడ: మంగళగిరిలోని 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో బదిలీ అయిన డీజీపీ గౌతమ్ సవాంగ్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ పోలీసు కవాతు నిర్వహించింది. ఈసందర్భంగా బదిలీ అయిన డీజీపీ గౌతమ్ సవాంగ్, నూతన డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి సవాంగ్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ.. 'నా 36 సంవత్సరాల పోలీసు సర్వీసు ఇవాల్టితో ముగుస్తోంది. డీజీపీగా 2 ఏళ్ల 8 నెలల కాలం పనిచేశా. ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనల ప్రకారం ఈ రెండున్నర ఏళ్ల పాటు పని చేశాను. చాలా సంస్కరణలు, పోలీసు వ్యవహార శైలిలో మార్పులు తెచ్చేందుకు కృషి చేశాను. ప్రజలకు పోలీసు వ్యవస్థను చేరువ చేసేందుకు పని చేశాను. గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడేందుకు చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. 2 ఏళ్ల 8 నెలల పాటు నన్ను డీజీపీగా కొనసాగించిన సీఎంకు హృదయపూర్వక ధన్యవాదాలు.దిశా, మొబైల్ యాప్ నుంచి కూడా కేసులు నమోదు అయ్యేలా చేశాం. బాధితులు పోలీసు స్టేషన్‌కు రాకుండానే ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకున్నాం. 36 శాతం కేసులు డిజిటల్‌గా వచ్చిన ఫిర్యాదులే. 75 శాతం కేసుల్లో కోర్టులు విచారణ చేసి శిక్ష వేశాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లో 40 వేలకు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. స్పందన, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా మహిళలు, చిన్నారుల భద్రత కోసం పనిచేశాం. దిశా యాప్ డౌన్‌లోడ్ లక్ష్యాన్ని సీఎం జగన్ నిర్దేశించారు. ప్రస్తుతం కోటి 10 లక్షల మంది ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేశారు. అలాగే పోలీస్ సేవా వెబ్ సైట్ ద్వారా డిజిటల్‌గా ఎఫ్ఐఆర్‌లను డౌన్ లోడ్ చేసే అవకాశం కల్పించాం.డీజీపీ కార్యాలయం నుంచి ఇన్ స్పెక్టర్ కార్యాలయం వరకు డిజిటల్‌గా అనుసంధానం చేశాం. ఏపీ పోలీసు వ్యవస్థలో డిజిటల్‌గా చాలా మార్పులు చేయగలిగాం. పోలీసులకు వీక్లి ఆఫ్‌లు కల్పించారు. 7,552 ఎకరాల్లో పండించిన గంజాయిని తొలిసారిగా ధ్వంసం చేశాం. పోలీస్ వ్యవస్థ పై ప్రజలకు చాలా ఆశలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న వాతావరణంలో సవాళ్ళను ఎదుర్కొంటూనే పని చేయాల్సి ఉంటుంది. నూతన డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పోలీస్ వ్యవస్థను ఉన్నత శిఖరాలపై నిలబెడతారని ఆశిస్తున్నా. సీఎం జగన్ మనపై ఉంచిన బాధ్యతలు పూర్తిగా నిర్వహించాలి' అని గౌతమ్‌సవాంగ్ అన్నారు.

# ఏపీలో విద్యుత్ కోతల ప్రచారం అబద్ధం

ఏపీ విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నాగులపల్లి శ్రీకాంత్

అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ అంతరాయంపై వస్తున్న కథనాలను ఏపీ విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నాగులపల్లి శ్రీకాంత్ ఖండించారు. విద్యుత్ అంతరాయంపై వస్తున్న కథనాలన్నీ అవాస్తవమని పేర్కొన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటలు విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు.నిబంధనలకు అనుగుణంగానే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు పూర్తిగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రోజుకి 204 మిలియన్ యూనిట్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. 30 మిలియన్ యూనిట్లను రోజు తాత్కాలిక అవసరాల కోసం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు.

# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రనాథ్‌రెడ్డి

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీగా కసిరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గౌతమ్ సవాంగ్ నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, 1992 బ్యాచ్‌కు చెందిన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీగా ఉన్నారు. ఆయన 1994లో ఉమ్మడి ఏపీలో నిజామాబాద్ జిల్లా బోధన్ అదనపు ఎస్పీగా పోస్టింగ్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లాలో పలు బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం ఆయన విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలతో పాటు సీఐడీ, రైల్వే ఎస్పీగా పనిచేశారు. విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. హైదరాబాద్ వెస్ట్ జోన్, మెరైన్ పోలీస్ విభాగంలో ఉత్తర కోస్తా ఐజీగా పనిచేశారు. పలు కీలక కేసులను ఛేదించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.



# కాకినాడకు పట్టిన అవినీతి చీడపురుగు ద్వారంపూడి: పట్టాభి

అమరావతి: ఎమ్మెల్యే ద్వారంపూడ చంద్రశేఖర్‌రెడ్డిపై టీడీపీ నేత పట్టాభి మండిపడ్డారు. “కాకినాడకి పట్టిన అవినీతి చీడపురుగు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి. మంత్రితో కలిసి పేదల బియ్యాన్ని ద్వారంపూడి దోచుకుంటున్నారు. నిజాలు బయటపెట్టిన వారిని బూతులు తిడతారా?. కాకినాడని అవినీతికి అడ్డాగా మార్చారు. లెక్కలు తెలియకుండా ఇష్టానుసారం మాట్లాడే.. ద్వారంపూడి బాగోతాన్నే బయటపెట్టాను. 2018-19లో 18.09 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడ పోర్ట్ నుంచి ఎగుమతి అయ్యాయి. 2020-21లో 31.51 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి అయ్యాయి. బియ్యం ఎగుమతులు ఎలా పెరిగాయో ద్వారంపూడి సమాధానం చెప్పాలి?.. టీడీపీ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కట్టుకథలు చెబుతున్నారు. ద్వారంపూడి ఇష్టానుసారం మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

# ఏపీపీఎస్సీ చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్.. ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి గౌతమ్ సవాంగ్‌ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, 2019 జూన్ నుంచి ఆంధ్రప్రదేశ్ డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించిన సవాంగ్‌ను ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో సవాంగ్‌ను ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.



# సంపాదకీయం

ఆదివారం 20 ఫిబ్రవరి 2022

## మహారాష్ట్రలో మారుతున్న రాజకీయాలు

మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మూడు పార్టీల బీజేపేతర కూటమి రాబోయే రోజుల్లో సరికొత్త సవాళ్లతో ఎదుర్కోనుంది. మహారాష్ట్ర వికాస్ అఘాడ అసెంబ్లీ స్పీకర్ ఎన్నికతో సహా కఠినమైన సవాళ్లకు సిద్ధమవుతోంది. ఇది ఐక్యతను దాని భాగస్వామ్య పక్షాల సమగ్రతను పరీక్షకు సమయం ఆసన్నమైంది. తమ ఎమ్మెల్యేలు కొందరు బీజేపీకి ఎర వేసినట్లు వస్తున్న వార్తలపై కూటమిలోని భాగస్వామ్య పక్షాల్లో ఒకటైన కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. ముంబయితో సహా 10 నగర మునిసిపల్ కార్పొరేషన్‌లకు వచ్చే ఎన్నికల్లో ఎంవీఏకు బీజేపీ పెద్ద సవాలుగా మారడం ఖాయమంటున్నారు ఇతర భాగస్వామి అయిన శివసేన ముఖ్యనేత సంజయ్ రౌత్‌పై బీజేపీ మోపిన అవినీతి ఆరోపణలతో కొంత మసకబారింది అధికార పార్టీ. ఈ సవాళ్లన్నింటి ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే సిద్ధమయ్యారు. ఇటీవల శస్త్రచికిత్స కారణంగా సుదీర్ఘకాలం విశ్రాంతి తీసుకున్న ఆయన, పూర్తి స్థాయిలో విధులకు హాజరవుతున్నారు. అలాగే, బీజేపేతర ఫ్రంట్ కోసం తదుపరి ప్రతిపాదనపై చర్చించడానికి ఫిబ్రవరి 20 న ముంబైలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ నేతలతో సమావేశమవుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ సీఎం కే.చంద్రశేఖర రావును కలవనున్నారు. 2024లో బీజేపీని ఎదుర్కోవాల్సిన ప్రాంతీయ పార్టీలు. కాంగ్రెస్ లేని కూటమి ప్రతిపాదన కూడాలోని ఐక్యతను పరీక్షించనుంది. శాసనసభ సమావేశాల్లో 2022 –23కి రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో, ఉద్ధవ్ థాకరే నాయకత్వంలో గత రెండేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి కూడా కీలకమైన రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్న శాసనసభలో అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక జరగాల్సి ఉంది. మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైనప్పుడు ఎమ్మెల్యే నానా పటోలే ఏడాది క్రితం రాజీనామా చేయడంతో స్పీకర్ పదవి కాంగ్రెస్ కోటాలో ఖాళీగా ఉంది. పార్టీ ఇంకా నామినీని ప్రకటించలేదు. అయితే, మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ముంబై ఎమ్మెల్యే అమీన్ పటేల్, సంగ్రామ్ తోప్టే (భోర్, పూణే) పేర్లు స్పీకర్ పదవికి ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అన్ని రకాల ఒత్తిళ్లు, ప్రలోభాలను అధిగమించి పార్టీ అభ్యర్థిని స్పీకర్‌గా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం సూచించింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సీనియర్ నేతలు సుశీల్‌కుమార్ షిండే, ఎంఎం పల్లంరాజు బుధవారం పార్టీ ఎమ్మెల్యేలతో వాగ్వాదానికి దిగారు. కేంద్ర సంస్థల స్కానర్‌లో ఉన్న డజను మంది నాయకులతో పాటు నాయకుల మధ్య రాజకీయ బురదజల్లడాన్ని పరిగణనలోకి తీసుకుంటే, స్పీకర్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని కాంగ్రెస్ భయపడుతోంది. మనుగడకు స్పీకర్ ఎన్నిక చాలా కీలకం. దీని ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా భావిస్తోంది. దీని ఫలితం కి వ్యతిరేకంగా నియోజకవర్గాల రాజకీయ స్థితిని సూచిస్తుంది. రెండేళ్ల క్రితం పటోలే స్పీకర్‌గా ఎన్నికైనప్పుడు, బీజేపీ తన అభ్యర్థిని ఉపసంహరించుకుంది. అయితే, శివసేన, బీజేపీ మధ్య పెరుగుతున్న వైరుధ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే, బీజేపీ తన దాతృత్వాన్ని పునరావృతం చేసే అవకాశం లేదు. ఇదిలావుంటే, అధికార అసెంబ్లీ స్పీకర్ భాస్కర్ జాదవ్‌తో దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ గతేడాది సస్పెన్షన్‌కు గురైన 12 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో యాదృచ్ఛికంగా బీజేపీ ఉత్సాహంగా ఉంది. కాంగ్రెస్ మంత్రులులో చిన్నచూపుతో ఉన్నారని, ప్రధానంగా విస్మరించారని అసౌకర్యాన్ని వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో కూడా కాంగ్రెస్ సభ్యులను ఎన్‌సిపి వేటాడి, కాంగ్రెస్‌ను మరింత బలహీనపరిచింది. వలసదారుల ద్వారా మహారాష్ట్రను కరోనావైరస్ సూపర్ స్ప్రెడర్‌గా అభివర్ణించినందుకు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నాయకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ఆందోళనల ద్వారా రాజకీయ రంగంలో తన ఉనికిని చాటుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. మీడియాలో ఎక్కువగా కనిపించే శివసేన ముఖమైన సంజయ్ రౌత్‌పై బిజెపి నాయకుడు కిరీట్ సోమయ్య చేసిన అవినీతి ఆరోపణలతో శివసేనను ఇరకున పడేలా చేసింది. సందేహాస్పదమైన కొన్ని ఆస్తి లావాదేవీల్లో ఉద్ధవ్ భార్య రష్మీ ప్రమేయం ఉందని సోమయ్య ఆరోపించారు. దీనిని బీజేపీ రాజకీయ ప్రతీకార చర్య అని పేర్కొంటూ సంజయ్ రౌత్ ఆరోపణలను తోసిపుచ్చారు. అవినీతి బీజేపీ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎంవీఏ ప్రభుత్వం చర్య తీసుకోవడానికి ఇంతకాలం ఎందుకు వేచిచూసిందనేది ప్రధాన ప్రశ్న. రెండు నెలల్లో ఎన్నికలకు వెళ్లే దాని సిటాడెల్ బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్‌లో సత్తా చాటేందుకు, శివసేన ఇప్పటికే 500 చదరపు అడుగుల వరకు ఉన్న ఇళ్లకు ఆస్తి పన్నును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దాని ప్రధాన 'మరాఠీ మనోస్' ఓటు బ్యాంకును పరిష్కరించేందుకు దుకాణాలకు మరాఠీ సైన్‌బోర్డులను తప్పనిసరి చేసింది. అంతేకాకుండా, ఉద్ధవ్ ఠాక్రే అతని మంత్రి కుమారుడు ఆదిత్య ఠాక్రే తమ విజయాలను ప్రదర్శించడానికి ప్రధానంగా ముంబైలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నారు. శివసేన కూడా బీజేపీకి ప్రత్యామ్నాయ కాషాయ పార్టీగా జాతీయ స్థాయికి వెళ్లాలని కోరుకుంటోంది. ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటోంది. గోవాలో కూటమి ఏర్పాటు కోసం సంజయ్ రౌత్ రాహుల్ గాంధీని కలిశారు. కానీ అతని చర్చలు ఫలించలేదు. చివరికి, శివసేనతో పొత్తు పెట్టుకుంది. దాని గొప్ప ప్రణాళికలు ఉన్నప్పటికీ, శివసేన కూడా లోపల గుసగుసలను ఎదుర్కొంటోంది. ఫిబ్రవరి 9న పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండే పుట్టినరోజు సందర్భంగా ఆయన మద్దతుదారులు 'కాబోయే ముఖ్యమంత్రి' అని అభివర్ణిస్తూ హోర్డింగ్‌లు ప్రదర్శించారు. ఠాక్రేల ఆధ్వర్యంలో నడిచే రాజవంశ సంస్థ పార్టీకి ఇది షాకింగ్‌గా మారింది. తన అనూహ్య వ్యూహాలతో, పవార్ తన పార్టీని శివసేనతో పొత్తు కుదిరేలా చేసింది. అలాగే, వివాదాస్పద అంశాలపై ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఉద్ధవ్ అనారోగ్యంతో ఉన్నప్పుడు. షిండే ఎపిసోడ్‌తో పాటు, సోమయ్య వంటి బీజేపీ నాయకులపై చర్య తీసుకోనందుకు ప్రభుత్వంపై సంజయ్ రౌత్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన వేదన ప్రజల్లో నెలకొంది. అన్ని భాగస్వామ్య పార్టీల నాయకులు అంతర్గత సమస్యలతో పాటు ఒకరితో ఒకరు విభేదాలను కలిగి ఉన్నారు. అయితే అసమానతలు ఉన్నప్పటికీ రెండేళ్లుగా కలిసి ఉన్నారు. బీజేపీతో బురదజల్లడం నిరాటంకంగా కొనసాగుతోంది. ప్రభుత్వాన్ని కనీసం పూర్తి కాలం కొనసాగించడానికి నాయకులు పోరాడుతున్నారు.

# వైసీపీలో జిల్లాల సెగ...

తిరుపతి, ఫిబ్రవరి 19, )ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన వ్యవహారం, అధికార పార్టీలో అసంతృప్తికి ఆజ్యం పోస్తోందా అంటే, అవుననే అంటున్నారు, రాజకీయ విశ్లేషకులు. అంతే కాకుండా మంత్రి పదవి ఆశించి భంగపడిన సీనియర్ నాయకులు ఇతరత్రా వివిధ కారణాల చేత అసంతృప్తితో ఉన్న నాయకులకు తమ అసంతృప్తిని వ్యకపరిచేందుకు, జిల్లాల విభజన ఒక అవకాశం కల్పించిందని అంటున్నారు. ఇప్పటికే, నగరి ఎమ్మెల్యే రోజా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి, నగరి నియోజకవర్గాన్ని బాలాజీ జిల్లాల్లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి గత కొన్ని రోజులుగా నియోజక వర్గంలో పర్యటించిన ఆమె జిల్లాల పునర్విభజనకు సంబదించి ప్రజాభిపాయాన్ని సేకరించారు. ఇందుకు సంబందించిన నివేదికను, ఆమె ముఖ్యమంత్రికి జగన్ రెడ్డికి, చీఫ్ సెక్రెటరీ సమీర శర్మకు సమర్పించారు. నగరి నియోజక వర్గంలో అధిక భాగం తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ఉందని అందుకే నగరి నియోజక వర్గాన్ని, బాలజీ జిల్లాలో చేర్చాలని కోరారు. నియోజక వర్గ ప్రజలు కూడా అదే కోరుతున్నారని ఆమె వివరిచారు. రోజా మంత్రి పదవిని ఎంతగా ఆశిస్తున్నారో వేరే చెప్పనక్కర లేదు. గుళ్ళు గోపురాలు పట్టుకు తిరగడం మొదలు, అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఆలాగే ఆమెకు జిల్లా మంత్రి పెద్దిరెడ్డి వర్గానికి మధ్య పచ్చ గాడి వేస్తే భగ్గుమనే పరిస్థతి వుంది. ఆమెకు మంత్రి పదవి రాకపోవడానికి అది కూడా కానమని అంటారు. అయితే, రోజా ఈ రెండు విషయాల్లో తమ అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు ఈ మార్గాని ఎంచుకున్నారా, లేక జగనన్నకు తమ ఆవేదనను తెలియ చేసేందుకే ఈ మార్గన్ని ఎంచుకున్నారా అనేది స్పష్టం కావలసి వుంది. అదలా ఉంటే,

నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ఆనం రామనారాయణ రెడ్డి అయితే జిల్లాల విభజన అంశాన్ని తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు అస్త్రంగా చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు గట్టిగా నమ్ముతున్నారు. కాగా, ఇప్పటికే ఒకటి రెండు సందర్భాలలో ముఖ్యమంత్రి వ్యవహార తీరుపై భగ్గుమన్న ఆనం, ఇప్పుడు మళ్ళీ మరోమారు జిల్లాల పునర్విభజన పై అగ్గి మీద గుగ్గిలమే అయ్యారు. జిల్లా విభజన సహేతుకంగా జరగలేదని, రైతులు ఇబ్బంది పడతారని, సాగునీటి ప్రాజెక్ట్ ల వద్ద కొట్లాటలు జరుగుతాయని, ఒక విధంగా రాష్ట్రంలో అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొంటాయని అన్నారు.

అదికరాలపై అయితే ఆనం, తగ్గేదే లే' తీరులో విరుచుకు పడ్డారు. ఇలా మాజీ మంత్రి మాట్లాడిన తీరు, జగన్ రెడ్డితో ఇక తాడో పేడో తేల్చుకునే రీతిలోనే ఉందని, ఒక రకంగా ఇది అధిష్టానాన్ని ధిక్కరించడమేనని పరిశీలకులు అంటున్నారు. అయితే ఇప్పటికే సొంత పార్టీ ఎంపీ రఘురామ కృష్ణం రాజు విషయంలో తప్పటడుగులు వేసి, తిప్పలు కొని తెచ్చుకున్న నేపథ్యంలో, రామనారాయణ రెడ్డి విషయంలో తొందరపాటు ప్రకటనలు చేయవద్దని, పార్టీ రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకులను హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే ఆనం ఇక వైసీపీలో తనకు రాజకీయ భవిష్యత్ లేదనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. అందుకే ఆయన జంకూ బొంకూ లేకుండా జగన్ నిర్ణయాలను ప్రశ్నిస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. నిజానికి ఆనం తనంతట తానూ బయటకు రావడం కాకుండా, తనపై పార్టీ వేటు వేయాలని కోరుకుంటున్నారనే మాట కూడా ఆనం సన్నిహితుల నుంచి వినిపిస్తోంది.

# పెనుగ్రంచిపోలుకు ఎంతో విశిష్టత

విజయవాడ, ఫిబ్రవరి 19) కొన్ని ప్రదేశాలకు కొన్ని విశిష్టతలు ఉంటాయి. ఆ విశిష్టత అంతా ఆ ప్రాంతాలలో ఉన్న ప్రత్యేకతను బట్టి వస్తూ ఉంటుంది. అలా ప్రత్యేకత సంతరించుకుని ఎవ్వరికీ పెద్దగా తెలియని ప్రాంతం పెనుగంచిప్రోలు. కృష్ణా జిల్లాలో ఉన్న జగ్గయ్యపేట నుండి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఈ పెనుగంచిప్రోలు ఉంది. ప్రతి పేరు వెనుక ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది. కొన్ని ప్రాంతాలను ఆ ప్రాంతాలలో గొప్ప వ్యక్తుల పేర్ల, కుటుంబాల ఆధారంగానూ, మరికొన్ని ప్రాంతాలలో పరిస్థితుల కారణంగానో, ఇంకా కొన్ని ప్రాంతాలలో భౌగోళిక పరంగానూ మరికొన్నిటికి ప్రదేశాల్లో ఉన్న ప్రత్యేకత కారణంగానో పేర్లు స్థిరపడి ఉంటాయి. అలాంటిదే ఈ పెనుగంచిప్రోలు కూడా. దీని అసలు పేరు పెదకంచి అని కాలం మారుతూ ఇది పెనుగంచిగా ఆ తరువాత పెనుగంచిప్రోలుగా రూపాంతరం చెందిందని చరిత్ర చెబుతోంది. ఈ పెనుగంచిప్రోలు లేదా పెదకంచి లేదా పెదగంచిలో దేవాలయాలు ఎక్కువగా ఉండేవని చరిత్ర చెబుతోంది. తమిళనాడులో కంచి ఉంది. దాని చిన్న కంచి అని పిలుస్తారు. అది చిన్న కంచి అయితే కృష్ణా జిల్లాలో ఉన్నది పెద్ద కంచి అని పేర్కొన్నారు. అంటే ఎంతో గొప్పదైన కంచి కంటే కూడా అద్భుతమైన దేవాలయాల సమాహారం ఈ పెదగంచి అని అర్థం చేసుకోవచ్చు. కృష్ణాజిల్లా పెదగంచి పక్కనే మున్నేరు ప్రవహిస్తూ ఉండేది. ఆ మున్నేటికి వరదలు వచ్చి పెదగంచిని ముంచేసిందని ఆ మున్నేటి ప్రతాపానికి ఎన్నో దేవాలయాలు మునిగిపోయా యని చెబుతారు. ఆ మునిగిపోయినవి క్రమేణా భూమిలోకి చొచ్చుకుపోయా యని ఇప్పటికీ మున్నేరుకు వరద వస్తే ఆ వరద నీటిలో తొంగిచూసినప్పుడు ఇసుక మధ్యలో నుండి ఎన్నో దేవాలయాల స్తంభాలు, ఇతర శిలిలాలు కనిపిస్తూ ఉంటాయి. చరిత్రలో చూస్తే మున్నేటి ఒడ్డున గోల్కొండ నవాబు అయిన కూలీకుతుబ్ షా కు, హిందూ రాజులకు యుద్ధం జరిగిందని, ఆ యుద్ధంలో కూలీకుతుబ్ షా గెలిచాడని. ఆ గెలుపు వల్ల ఆలయాలు ధ్వంసం చేసి ఎంతో సంపదను ఎత్తుకుపోయాడని, ఆ ఆలయాల శిథిలాలు క్రమంగా భూగర్భంలో కలిసిపోయి అవే అప్పుడప్పుడూ బయటపడుతుంటాయని చెబుతారు. గంధపు చెట్లు ఎక్కువగా పెరిగే అడవుల్లో ఆ గంధపు చెక్కలను పొయ్యిలో మంట పెట్టడానికి కూడా వాడతారు, అదే అరుదుగా లభించే వాళ్లకు ఆ గంధపు చెట్లు ఎంతో అపురూపం. అలాగే ఈ పెనుగంచిప్రోలు విషయం కూడా ఇంతే అనిపిస్తుంది. స్థానికులకు ఈ ఆలయాల విశిష్టత, వాటి ప్రాధాన్యత తెలియదు అనడానికి ఉదాహరణ అక్కడ ఎంతో గొప్ప ఆలయాల ఆనవాళ్లు ఉన్నాయని తెలిసినా వాటిని పెద్దగా పట్టించుకోరు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కూడా ఇందుకు ఓ కారణం కావచ్చు. పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందినది. ఇది రాష్ట్రంలో 11 వ స్థానంలో ఉండి ఎంతో గొప్ప పేరు తెచ్చుకుంది. ఇక్కడి అమ్మవారి కల్యాణం, గ్రామ దేవత తిరునాళ్ళు ఎంతో గొప్పగా జరుగుతాయి. ఎక్కడెక్కడి నుండో భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. ఒక ఆసక్తికర విషయం ఏమిటంటే ఈ పెనుగంచిప్రోలులో 101 దేవాలయాలు ఉన్నాయి. వీటిలో ఎన్నో గొప్ప ఆలయాలు, అరుదైన దేవాలయాలు ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు పెనుగంచిప్రోలుకు వెళ్తే ఒకదానికి ఒకటి దగ్గరగా ఉన్నట్టు ఈ పెనుగంచిప్రోలుకు దగ్గరలోనే విజయవాడ దుర్గమ్మ, వేదాద్రి నరసింహస్వామి, శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు క్షేత్రం, కొల్లేటికోటలో పెద్దింట్లమ్మ, నెమలి వేణుగోపాలస్వామి, పెదకళ్లెపల్లి నాగేశ్వరాలయం, ఆకిరిపల్లి వ్యాఘ్రనరసింహస్వామి దేవాలయం. ఇలా అన్నీ ఎంతో అద్భుతమైన దేవాలయాలను కూడా చూడచ్చు. హాయిగా దేవాలయాలను చూస్తూ చుట్టిరావచ్చు.

# హాట్ టాపిక్ గా మారిన సజ్జల



నెల్లూరు, ఫిబ్రవరి 19, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కేవలం 24 గంటల్లో తీసుకున్న రెండు నిర్ణయాలు రాష్ట్రంలో హాట్ టాపిక్ అయి కూర్చున్నాయి. ఒకటి ప్రవీణ్ ప్రకాశ్ బదిలీ అయితే.. మరొకటి డీజీపీ గౌతమ్ సవాంగ్ బదిలీ. అయితే ప్రవీణ్ ప్రకాశ్ బదిలీపై వెలగపూడి సచివాలయంలోని ఉన్నతాధికారులే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఏఎస్‌లంతా... చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ అంటూ.. చాలా ఖుషీ ఖుషీగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు డీజీపీ గౌతం సవాంగ్ బదిలీ పట్ల అటు ఉన్నతాధికారుల్లో.. ఇటు ఫ్యాన్ పార్టీ నేతల్లో తీవ్ర గుబులు అయితే రేపుతోందన్నది మాత్రం సుస్పష్టం. చేయని తప్పుకు గౌతమ్‌ను బలి చేశారనే టాక్ అయితే... అమరావతిలో మాత్రం రచ్చ రచ్చ చేసి పెడుతోంది. ఎందుకంటే.. అధికారిక హోదాలో డీజీపీగా గౌతమ్ సవాంగే ఉంటారని... సదరు డీజీపీగా ఆయనకు ప్రభుత్వం అన్నీ సౌకర్యాలు కల్పిస్తోందని... కానీ.. డీజీపీగా తీసుకునే నిర్ణయాలు మాత్రం ఆయన చేతుల్లో ఉండవన్నే సంగతి చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసునన్న సంగతి అతి కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఇది ఎవరు నమ్మినా నమ్మక పోయినా ఇది మాత్రం పక్కా వాస్తవమని అమరావతిలోనే కాదు.. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సైతం ఇదే చర్చ నడుస్తోంది. మరి అయితే డీజీపీ తీసుకునే నిర్ణయాలు అన్నీ ఎవరి చేతిలో ఉంటాయి.. వాటిని ఎవరు తీసుకుంటారంటే మాత్రం అందరి చూపుడు వేళ్లు మాత్రం ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపిస్తాయని సమాచారం. జగన్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి సకల శాఖల మంత్రిగా ప్రాచుర్యం పొందిన సజ్జల వారే అనధికారిక హోంమంత్రిగా వ్యవహరిస్తారనే టాక్ అయితే రాష్ట్రంలో మస్త్ మస్త్‌గా నడిచింది.. నడుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులకు సైతం నేరుగా సజ్జల వారే ఆదేశాలిస్తారన్న టాక్ కూడా ఖాకీ డిపార్టుమెంట్‌లో ఉండనే ఉంది. రాష్ట్ర హోంమంత్రి ఎం సుచరిత ఎప్పుడైనా ప్రెస్‌మీట్లు పెట్టమని ఫ్యాన్ పార్టీ ఆఫీసు నుంచి ఆదేశాలు వస్తే మాత్రమే వాటిని ఆమె తూ.చ తప్పకుండా పాటిస్తారు. అంతే తప్ప ఆమె సమీక్షలు చేసే పరిస్థితి కూడా లేదని ఆ పార్టీ నేతలే తాడేపల్లి క్యాంప్ కార్యాలయం సాక్షిగా గుసగుసలాడుకుంటారు. అయితే డీజీపీ కార్యాలయంలోని అన్ని వ్యవస్థల్లో సజ్జల వర్గానికి చెందిన వ్యక్తులు కీలకంగా ఉన్నారనే చర్చ కూడా బాహటంగా ఉంది. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనలో ఓ సీఐ సివిల్ దుస్తుల్లో అల్లరి మూకలతో కలిసి దాడులు చేస్తూ దొరికిపోయారంటు నాడు మీడియా సాక్షిగా రచ్చ రచ్చ అయిన సంగతి అందరికీ తెలిసిందే. ఇక రాజకీయ నేతల అరెస్టులను సీఐడీ చేతుల మీదుగా జరిపిస్తుంటారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆ క్రమంలో రాజకీయ కక్ష సాధింపులన్నీ సీఐడీనే పర్యవేక్షిస్తోందనే అపవాదును సైతం ఈ జగన్ ప్రభుత్వం మూట కట్టుకోంది. అసలు డీజీపీగా ఉన్న సవాంగ్‌కు ఏ మాత్రం సంబంధం లేకుండానే.. ఈ వ్యవహారాలన్నీ అంతా సైలెంట్‌గా జరిగిపోతుందంటారు పోలీసు శాఖలోని పలువురు ఉన్నతాధికారులు. తాజాగా ఎమ్మెల్సీ పి.అశోక్ బాబును అరెస్ట్ చేసినప్పుడు పోలీసులు.. అదనపు ఎస్పీని సంప్రదిస్తే తమకు విషయం తెలియదని ఆ విషయాన్ని సీఐడీనే అడగాలని చెప్పడం గమనార్హం. అలా పోలీసు వ్యవస్థలో భాగమైన సీఐడీపై డీజీపీ గౌతమ్ సవాంగ్‌కి అసలు అదుపు లేకుండా పోయిందని చెప్పటానికి ఓ ఉదాహరణ మాత్రమే. అయితే జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ విషయంలో కూడా జగన్ ప్రభుత్వాన్ని డీజీపీ సవాంగ్ నిరాశపర్చలేదు. ఆయన సైలెంట్‌గా ఉండి. .. ఎప్పుడు ఏది మాట్లాడమని చెబితే అది మీడియాకు ఆయన చెబుతూ వచ్చారు.. వస్తున్నారు. ఇలా చెబితే తన పరువు పోతుందని తెలిసినా కూడా అన్నిటికి సిద్ధపడి డీజీపీగా గౌతమ్ అదే చేశారు. అదీకాక.. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. చాలా సార్లు.. డీజీపీగా గౌతమ్ తన ఇమేజ్‌ను సైతం పోగట్టుకున్నారనే టాక్ కూడా పోలీస్ శాఖలో ఉంది. సీఎంగా వైయస్ జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి ఎంపికగా సవాంగ్‌ను డీజీపీగా నియమించారు. అయితే జగన్ పదవీ బాధ్యతలు చేపట్టక ముందే సవాంగ్ యాక్షన్‌లోకి దిగిపోయారు. అప్పటి నుండి ఆయన పనితీరు విషయంలో ప్రభుత్వం ఎక్కడా అసంతృప్తిగా ఉన్నట్లుగా ప్రచారం జరగలేదు. చివరకు సోషల్ మీడియా పోస్టుల అరెస్టుల విషయంలో ప్రజల నుంచి విమర్శలు వచ్చినా.. కోర్టుల నుంచి నోటీసులు అందుకున్నా కూడా ప్రభుత్వం మాత్రం డీజీపీ గౌతమ్ పనితీరుపై సంతృప్తికరంగానే ఉందని తెలుస్తోంది. మరి ప్రభుత్వాన్ని జగన్ నడిపిస్తుంటే.. పోలీసు శాఖను మాత్రం సకల శాఖల మంత్రి సజ్జల నడిపిస్తున్నారని.. అలాంటిది.. గౌతమ్ సవాంగ్‌ను బదిలీ చేయడం ఎంత వరకు సబబు అని పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. సజ్జల వారి డైరెక్షన్‌లో పోలీసు శాఖ పని చేస్తుంటే.. పనిష్మెంట్ మాత్రం గౌతమ్ సవాంగ్‌కి ఇవ్వడం ఎంత వరకు సబబు అనే ప్రశ్నలు వస్తున్నాయి. మరోవైపు.. ఖాకీ డ్రస్‌తో ఉద్యోగం చేసుకునే గౌతమ్ సవాంగ్‌కు.. ఏపీపీఎస్సీ చైర్మన్ గా నియమించి.. చివరకు ఆయనకు ఆ డ్రస్‌ను కూడా దూరం చేసిందనే చర్చ అయితే పోలీస్ శాఖలో నడుస్తోంది.

## వేడెక్కుతున్న సింహపురి రాజకీయాలు

నెల్లూరు, ఫిబ్రవరి 19, నెల్లూరు జిల్లా వైసీపీ రాజకీయాలు వేడెక్కాయి. ఆనం రామనారాయణరెడ్డి వైసీపీలో ఒంటరి వాడయ్యారనే చెప్పాలి. ఇప్పుడు నెల్లూరు జిల్లా నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వెంకటగిరి నియోజకవర్గం బాలాజీ జిల్లాలో కలసి పోనుంది. దీనిని ఆనం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిరాహార దీక్ష కూడా చేస్తున్నారు. త్వరలో ముఖ్యమంత్రి జగన్ ను కలసి నెల్లూరు జిల్లాలోనే రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను ఉంచాలని ఆనం రామనారాయణరెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఇది సాధ్యమయ్యే పని కాదు. ఇందుకు ప్రభుత్వం కూడా అంగీకరించదు. ఆనం రామనారాయణరెడ్డి కి కూడా కావాల్సిందదే. ఆనం చెప్పినట్లుగా గతంలో రాపూరు నియోజకవర్గం ఆనం కుటుంబానికి పట్టుఉండేది. అయితే 2009 లో జరిగిన నియోజకవర్గాల పునర్విజనలో భాగంగా ఆనం కుటుంబానికి బలమైన రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలు వెంకటగిరి నియోజకవర్గాల్లో కలిపారు. దీనిపై పరోక్షంగా ఆనం విమర్శలు చేశారు. నేదురుమిల్లి జనార్థన్ రెడ్డి తమ కుటుంబానికి అన్యాయం చేశారని, అందుకు తగిన ఫలితాన్ని ఆయన అనుభవించారని పరోక్షంగా ఆనం రామనారాయణరెడ్డి నేదురుమిల్లి కుటుంబానికి శాపనార్థాలు పెట్టారు. ఇప్పుడు కూడా జిల్లాల విభజనలో తమకు అన్యాయం జరిగిందని ఆనం హైరానా పడుతున్నారు. దీనికి నేదురుమిల్లి జనార్థన్ రెడ్డి కుమారుడు రాంకుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. నీతి మాలిన రాజకీయాలు చేయవద్దని ఆనంను రాంకుమార్ రెడ్డి హెచ్చరించారు. తన తండ్రి నేదురుమిల్లి జనార్థన్ రెడ్డి లేకుంటే ఆనంకు రాజకీయ భవిష్యత్ ఉండేది కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. దీనికి తిరిగి ఆనం కౌంటర్ ఇచ్చారు. రాజకీయ అనుభవం లేని వాళ్లు మాట్లాడే మాటలను తాను పెద్దగా పట్టించుకోనని, ఈ విషయాన్ని జగన్ వద్దనే తేల్చుకుంటానని చెప్పారు. అయితే ఆనం అజెండా మాత్రం ఒక్కటే. జిల్లాల విభజనకు తాను వ్యతిరేకం కాదంటూనే జిల్లాల విభజన వల్ల నీటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అశాస్త్రీయంగా జిల్లాలను విభజిస్తే అధికార పార్టీకి రాజకీయ ఇబ్బందులు తప్పవని ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరిస్తున్నారు. దీని అర్థం తాను జిల్లాల విభజనకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తానని చెప్పకనే చెప్పారు. పార్టీ నుంచి సర్దుకుంటానికి కూడా రెడీ అని అంటున్నారు. వైసీపీ అధిష్టానం కూడా ఏమాత్రం తగ్గడం లేదు. నేదురుమిల్లి రాంకుమార్ రెడ్డి చేత ఆనంకు కౌంటర్ ఇప్పించి నీ స్థాయి ఇంతేనని గుర్తు చేసినట్లయింది. మొత్తం మీద ఆనం అజెండా క్రిస్టల్ క్లియర్ గా ఉంది.

## గ్రామ పంచాయితీ నిధుల కోసం పోరు

విజయవాడ, ఫిబ్రవరి 19, టీడీపీ కార్యాలయంలో రెండో రోజు సర్పంచుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ సర్పంచ్‌లకు చంద్రబాబు కీలక సూచనలు చేశారు. చెత్త పన్నుకు వ్యతిరేకంగా పంచాయతీల్లో తీర్మానం చేయాలని వారికి హితవు పలికారు. టీడీపీ సర్పంచ్‌లు ఉన్న ప్రతి చోట చెత్త పన్నుకు వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులను ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. ఫైనాన్స్ కమిషన్ నిధులు పంచాయతీలకు ఇవ్వకుంటే ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేయాలని.. ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తామని చంద్రబాబు తెలిపారు. వివేకా హత్య కేసు విషయంలో తండ్రి తర్వాత తండ్రి లాంటి బాబాయ్‌ను చంపి టీడీపీ మీద జగన్ విమర్శలు చేశారని చంద్రబాబు మండిపడ్డారు. ఈ కేసులో దొంగలను పట్టుకున్న సీబీఐది తప్పంటారా అని ప్రశ్నించారు. ఎంపీ అవినాష్ రెడ్డికి టిక్కెట్ ఇవ్వొద్దని వైఎస్ వివేకా అన్నందుకు కక్ష కట్టారన్నారు. పరిటాల రవి హంతకులను ఒక్కొక్కర్ని చంపేశారని.. రాష్ట్ర ముఖ్యమంత్రే నేరాలు, ఘోరాలు చేస్తూ హత్య రాజకీయాలు చేస్తే ఎలా అంటూ నిలదీశారు. సర్పంచ్‌లను సీఎం జగన్ ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లను కాదని ఒక్క పని చేయడానికైనా వీల్లేదన్నారు. గ్రామాల్లో సర్పంచులే సుప్రీం అన్నారు. టీడీపీ సర్పంచులు పట్టుదలతో వ్యవహరిస్తే వైసీపీ సర్పంచుల నుంచే మద్దతు లభిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ హయాంలో కట్టించిన భవనాలకు రంగులేసుకోవడంతోనే వైసీపీ పాలన సరిపోతోందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. రూ. 7 వేల కోట్లకు పైగా నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి రాష్ట్రానికి వచ్చాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల ఖాతాలకు చేరాల్సిన నిధులను ప్రభుత్వం తీసేసుకుందని మండిపడ్డారు. గ్రామాల్లో పేదలకిచ్చిన ఇంటి జాగా నివాస యోగ్యంగా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల సేకరణలో భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. పేదలకిచ్చిన భూములన్నీ లోతట్టు ప్రాంతాల్లోనే ఉన్నాయని.. ఓ పంచాయతీ నుంచి మరో పంచాయతీకి రోడ్లేయలేని సీఎం జగన్.. విమానాలు తెస్తారట అంటూ సెటైర్లు వేశారు. విమానాలు వస్తే రోడ్లతో పనే ఉండదు.. రోడ్ల మీద వ్యవసాయం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు జగన్ ముద్దులు పెట్టి.. ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాళ్లు వేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచారు.. విపరీతంగా అప్పులు తెచ్చారు.. కానీ జెన్‌కో ఉద్యోగులకు జీతాలివ్వలేకపోయారని విమర్శించారు. టీడీపీ హయాంలో ఒక్క రోజైనా ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా ఇచ్చామా అని అడిగారు. సీఎం జగన్ హోల్ సేలుగా దోచుకుంటుంటే.. మిగిలిన అధికార పార్టీ నేతలు చిల్లర దోపిడీలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుకను హోల్ సేల్‌గా అమ్మేశారని.. గ్రామాలకు రావాల్సిన సెస్ రాకుండా చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మరింత మధురంగా తిరుమల లడ్డూ

తిరుమల, ఫిబ్రవరి 19, తిరుమల శ్రీవారి లడ్డూకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ తిరుమల లడ్డూ అంటే ఎంతో మంది ఇష్టపడుతుంటారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో, విదేశాల్లో సైతం తిరుమల లడ్డుకు ప్రత్యేక స్థానం ఉంది. శ్రీవారి లడ్డూను ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇక నుంచి ఈ లడ్డూ మరింత రుచిగా ఉండనుంది. లడ్డూ తయారీకి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు చక్కెర, నెయ్యితో పాటు శనగపిండి. అయితే ఎప్పుడు ఆ శనగపిండికి అవసరమైన పప్పును అనంతపురం జిల్లా నుంచి పంపిస్తున్నారు. పూర్తిగా ప్రకృతి సిద్ధంగా సాగు చేసిన పంటను సేకరించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపట్టింది. వ్యవసాయ విభాగం డీపీఎం లక్ష్మానాయక్ సహకారంతో



ఈనెలాఖరున అవసరమైన పప్పు శనగను శ్రీవారి సన్నిధికి చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జీరో బేస్డ్ నాచురల్ ఫార్మింగ్ విభాగం ఆధ్వర్యంలో తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామంలో 57 మంది రైతులు సహజ విధానంలో సాగు చేసిన 185 ఎకరాల్లోని 1,396 క్వింటాళ్ల పప్పుశనగకు ఇటీవల టీటీడీ నుంచి ఆర్డర్ వచ్చినట్లు డీపీఎం లక్ష్మానాయక్ తెలిపారు.

# ఢమాల్ ... టమోత



కర్నూలు, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్)మొన్నటి వరకు ఆకాశాన్ని అంటిన టమోటా ధర.. ఒక్కసారిగా కుప్పకూలింది. కిలో టమోటా 10 రూపాయలకు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు టమోటా ధర పూర్తిగా పడిపోవడంతో పత్తికొండ టమోటా మార్కెట్‌ను బంద్ చేశారు అధికారులు. వాస్తవానికి కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్ టమోటాకు పెట్టింది పేరు. ఆంధ్రప్రదేశ్‌లో మదనపల్లె తరువాత టమోటా పంట ను పత్తికొండ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తారు రైతులు. ఓ రైతుకు 4 ఎకరాల పొలం ఉంటే అందులో 3 ఎకరాల విస్తీర్ణంలో టమోటా పంటనే సాగు చేస్తారు రైతులు. అయితే దేశ వ్యాప్తంగా తుపానులు రావటంతో అక్కడ ఉన్న టమోటా పంటలు పూర్తిగా దెబ్బతినడంతో తెలుగు రాష్ట్రాలలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి కిలో టమోటా 100 రూపాయల నుండి 120 రూపాయల వరకు ధర పెరగింది. దాంతో వినియోగదారులు హడలిపోయారు. అయితే రైతులు మాత్రం ఎప్పుడూ లేని ధర ఒక్కేసారి పెరగడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో టమోటా ధర కిలో 50 రూపాయల నుండి మొదలై 120 వరకు పెరిగింది. తెలుగు రాష్ట్రాలలో ఎప్పుడూ లేని విధంగా టమోటాకు భారీ రేట్లు రావడం ఇదే మొదటిసారి. ఆరు నెలల పాటు మంచి రేట్లు ఉన్న టమోటా.. ప్రస్తుతం పూర్తిగా ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు పొలం నుంచి టమోటాలను మార్కెట్‌కు తరలిస్తే.. వాటి రవాణా చార్జీలు కూడా దక్కని పరిస్థితి నెలకొంది. దాంతో టమోటా పంట ను పొలంలోనే వదిలి వేస్తున్నారు రైతలు. ఇక రైతులకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌ను అధికారులు బంద్ చేశారు. మార్కెట్ బంద్ చేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులు.. మార్కెట్‌ను బంద్ చేయడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. అయితే పత్తికొండ రైతుల కల టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే కనీసం టమోటా పంటలకు గిట్టుబాటు ధర వస్తుందని, రైతులు బాగుపడుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కూడా టమోటా పంటకు రేట్లు లేక, మార్కెట్‌కు తరలించినా రవాణా ఖర్చులు కూడా రాక నడి రోడ్డుపై పారబోసిన సంఘటనలు ఉన్నాయి. గత నలబై సంవత్సరాల నుండి తాము ఎన్నికల్లో గెలిచిన వెంటనే పత్తికొండ టామోట్ జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం అని చెప్పడం, ఎన్నికల్లో గెలిచిన తర్వాత జ్యూస్ ఫ్యాక్టరీ విషయాన్ని గాలికి వదిలివేయడం అలవాటుగా మరిదంటూ రాజకీయ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతులు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు రైతులు.

# టిడిపి కార్యాలయం లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

నెల్లూరు నెల్లూరు జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని ఎన్టీఆర్ భవన్ లో శనివారం నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంఛార్జి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన నెల్లూరు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముందుగా మాజీ శాసన సభ్యులు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణ రెడ్డి గార్లకు సమావేశంలో జిల్లా టీడీపీ నేతలు సంతాపం తెలియచేశారు. అనంతరం ఈ సమావేశంలో ఈ క్రింది అంశాలను చర్చించి తీర్మానించడమైనది. ఈ నెల 24వ తేదిన నెల్లూరు లో చేపట్టదలచిన నారి సంకల్ప దీక్షను విజయవంతం చేసేందుకు జిల్లా లోని పది నియోజకవర్గాల నుండి మహిళలు అధిక సంఖ్యలో వచ్చేలా ప్రతి నియోజకవర్గ ఇంచార్జి కృషి చేసి ఈ దీక్షను విజయవంతం చేయాలని సమావేశంలో తీర్మానించడమైనది. జిల్లాల పునర్విభజన, జెన్కో ప్రైవేటీకరణ పై పార్టీ పరంగా చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సమావేశంలో చర్చించి తీర్మానించడమైనది. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనగా చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సమావేశంలో చర్చించి తీర్మానించడమైనది. పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేయుదలచిన క్లస్టర్ విధానం గురించి సమావేశంలో చర్చించి తీర్మానించడమైనది. జిల్లాలో నెలకొన్న సమస్యలు, వాటి పై చేపట్టాల్సిన ఆందోళన కార్యక్రమాల గురించి, జిల్లా వ్యాప్తంగా నిర్వహించాల్సిన గౌరవ సభల గురించి సమీక్షించి తీర్మానించారు. పై సమావేశం లో తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టిడిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సూలూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, కావలి నియోజకవర్గ ఇంఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు, మాజీ మంత్రి తాళ్ళపాక రమేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, మాజీ

**జిల్లాలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన ఆందోళన కార్యక్రమాల గురించి చర్చలు**

మంత్రి పరసా వెంకట రత్నం, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, టిడిపి రాష్ట్ర కర్యనిర్వహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు టతీ. జెడ్ శివ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి పట్టాభి రామి రెడ్డి, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు గుమ్మడిపూడి దశరథ ఆచారి, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు వెంకిటీల సురేంద్ర కుమార్, రాష్ట్ర కార్యదర్శులు దావా పెంచల్ రావు, బొమ్మన శ్రీధర్, బొమ్మి సురేంద్ర, రెబాల శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్దిని దూరం చేస్తున్న వైకాపా ఎమ్మెల్యేలు

ఏలూరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమస్యల సృష్టి కర్త ముఖ్యమంత్రి అని, ఏ ఒక్క సమస్య పరిష్కారం విషయంలోనూ ప్రజల కోసం ఆయన నిలబడింది లేదని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమంత్రి బాటలో పయనిస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతూ తమ నియోజక వర్గాలను అభివృద్ధికి దూరం చేస్తున్నారన్నారు. మిమ్మల్ని ఎన్నుకున్నట్టే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్ధులను ప్రజలు ఎన్నుకున్నారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి అండతో దౌర్జన్యాలకు పాల్పడుతూ రెచ్చిపోయే విధానం ఎవ్వరికీ మంచిది కాదని హెచ్చరించారు. జనసైనికులను, వీర మహిళలను జనసేన తరఫున పోటీ చేసిన వారిని కావాలనే టార్గెట్ చేస్తున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం పరిధిలోని మత్స్యపురి గ్రామంలో జనసేన నాయకుల, కార్యకర్తల సహకారంతో 14 లక్షలతో నిర్మించిన నూతన గృహాన్ని ప్రారంభించారు నాదెండ్ల మనోహర్.

## జీవీఎంసీ బడ్జెట్ అంకెల గారడీ

విశాఖపట్నం జివిఎంసి 2022-23 సంవత్సరానికి గానూ ప్రవేశపెడుతోన్న 4061.90కోట్ల బడ్జెట్ ఒక చిత్తుకాగితం, అంకెల గారడీ అని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. సిపిఎం నగర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధికి నిధుల ఖర్చు జరగడం లేద ని, దొడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను తరలిం చుకుపోతుందని విమర్శించారు. విద్య, వైద్యం, రోడ్లు, మురికివాడల సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు బడ్జెట్ల ద్వారా ఇంతవరకూ నయాపైసా ఖర్చు చేయలేదని వివరించారు. ప్రజలపై ఈ బడ్జెట్ భారాలు మోప నుందని, ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపు నిచ్చా రు. ఆస్తిపన్ను 545కోట్లు, చెత్తపై 55కోట్లు, మంచి నీటి ఛార్జీల ద్వారా 386 కోట్లు, బిల్డింగ్ ప్లాన్ ఫీజులు. 291 కోట్లు, చెత్త, ట్రేడ్ లైసెన్సుల ద్వారా 20కోట్లు వసూలుకు ఈ బడ్జెట్లో ప్రతిపాదించడం అన్యా యమన్నారు. ప్రజాబడ్జెట్ కోసం ప్రతిపక్ష కార్పొరేట ర్లంతా ఈనెల 24 నుంచి పోరాడతామని, అధికార వైసిపి కార్పొరేటర్లు కూడా కలిసి వస్తేనే వారి వారి వార్డుల్లో అభివృద్ధి సాధ్య పడుతుందని గంగారావు హితవుపలికారు. బడ్జెట్లలో విశాఖ ప్రజలను దగా చేశారని, వాస్తవ ఆదాయం కంటే అనేక రెట్లు ఎక్కువగా బడ్జెట్ను ప్రతిపాదించడం, అందులో నామమాత్రంగా ఖర్చు చేయడమంటే నగర ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో కనీసం 50కోట్లు కూడా ప్రజావ సరాల కోసం ఎక్కడా ఖర్చు చేసినా దాఖలా లేదన్నా రు. కాం ట్రాక్టర్లకు బకాయిలు చెల్లించకపోవడంతో వారు ఎంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం ఈ నిధులను తన అవసరాలకు వాడుకోవడం సరైంది కాదన్నారు. సిఎఫ్ఎంఎస్ బారి నుంచి జివిఎంసికి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు.

## జిల్లాకు అంబెద్కర్ పేరు పెట్టాలి

విశాఖపట్నం రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ఒక జిల్లాకు అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేయాలని విశాఖలో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. విశాఖ నగరంలోని ఎల్ఐసీ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ జిల్లా ప్రకటించాలని కోరు తూ నిరసన కార్యక్రమం నిర్వహించా రు. రాజ్యాంగ నిర్మాత గానే కాకుండా, అంబేద్కర్కు ఆంధ్ర రాష్ట్రంతో కూడా అనుబంధం ఉందని సాధన సమితి కన్వీనర్ కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. అంబేద్కర్ తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం, విశాఖ జిల్లా అనకాపల్లిలో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారని గుర్తు చేశారు. రాజ్యాంగ బద్దంగా పదవులను చేపడుతున్న ప్రజాప్రతినిధులు ... రాష్ట్రంలోని ఏదో ఒక జిల్లాకు అంబే ద్కర్ నామకరణం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు.

## ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలు

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 19 ఎమ్మిగనూరు మండలంలోని కేజీబీవీ పాఠశాలలో క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్లకు, విద్యార్థినిలకు క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స కాలపరిమితి, మొండి క్షయ వ్యాధి, డాట్స్ పద్ధతి పై అవగాహన కల్పించడం జరిగింది. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్లు చాంద్ భాషా, మల్లికార్జున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అదోని జిల్లా కోసం నిరసనలు

ఆదోని ఆదోని జిల్లాగా ప్రకటించాలని కోరుతూ రాయలసీమ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులతో కలిసి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతంగా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలను కలుపుతూ ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని వైసిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కర్నూల్ ప శ్చిమ ప్రాంతం ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ ప్రజలకు త్రాగు, సాగునీటి శాశ్వత పరిష్కారం కొరకు సుమారు 2 వేల కోట్ల రూపాయలతో ఆర్డీఎస్ కుడికాలవకు, మరియు గుండ్రేవుల, వేదవతి వంటి బృహత్తర ప్రాజక్టులను మంజూరు చేశారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక మంజూరైన ప్రాజెక్టులను రివర్స్ టెండరింగ్ పేరుతో పనులను కాలయాపన చేస్తూ ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర నియోజకవర్గ రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుండి శాసన సభ్యులు గా ఎన్నికైన వైసిపి శాసన సభ్యులు ఆదోని జిల్లాను ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం పై ఎందుకు వత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు.

# ఉగాది నాటికి కొత్త జిల్లాలు.. కొత్త మంత్రులు

విజయవాడ, ఫిబ్రవరి 19, ఉగాదికి కొత్త జిల్లాలతో పాటు కొత్తమంత్రులు కొలువుతీరనున్నారన్న ప్రచారంతో ప్రకాశంజిల్లాలో మంత్రి పదవుల కోసం తమ అదృష్టాన్ని పరిక్షించుకునే ఆశావహుల హడావిడి మొదలైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో.. ప్రకాశంజిల్లా నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్నవారిలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. కందుకూరు, గిద్దలూరు, సంతనూతలపాడు, దర్శి ఎమ్మెల్యేలు మంత్రి పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రి పదవి కోసం దర్శి, గిద్దలూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు వైఎస్ జగన్ బంధువు, మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి చుట్టూ తిరుగుతున్నారు. మంత్రి బాలినేనితో సఖ్యత లేని కందుకూరు ఎమ్మెల్యే నేరుగా వైఎస్ జగన్‌తో నెల్లూరుజిల్లా నేతల ద్వారా లాబీయింగ్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలనేది సీఎం స్వయంగా నిర్ణయిస్తారని అధిష్టానం పెద్దలు ఇప్పటికే తేల్చిచెప్పేశారు? ప్రస్తుతం వైసిపిలో మంత్రి పదవుల పందేరం హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో ఉగాది నుంచే కొత్త జిల్లాలు ఏర్పాటు అవుతాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో.. జిల్లాల ఏర్పాటుపై కలెక్టర్లు కసరత్తు ప్రారంభించారు. ఉగాది నుంచే కొత్తజిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాదికారులు కార్యకలాపాలు నిర్వహించనున్నారు. కొత్త జిల్లాలపై నోటిఫికేషన్ వచ్చిన రోజునుంచే ఓఎస్డీల హోదాలో కొత్త జిల్లాలకు కలెక్టర్లు, ఎస్పీలు బాధ్యతలు నిర్వహించనున్నారు. కొత్తజిల్లాలతో పాటు మంత్రివర్గ పునర్వస్తీకరణతో కొత్తమంత్రులు కూడా కొలువుతీరనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో మంత్రి పదవుల కోసం ఎమ్మెల్యేలు అధిష్టానం పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. తమకు అవకాశం కల్పించాలంటూ ఇప్పటికే జోరుగా పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంలో ప్రకాశంజిల్లా నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మంత్రి పదవులు ఆశిస్తున్నవారిలో ముందు వరుసలో ఉన్నారు. మరోవైపు మంత్రివర్గంలో మార్పులు చేసే సమయంలో ఇప్పుడున్న అందర్నీ తొలగించకపోవచ్చన్న చర్చ కూడా సాగుతోంది. సీనియర్లను అలాగే ఉంచి మిగిలిన వారిని మార్చేందుకు అవకాశం ఉందంటున్నారు. అలా కాకుండా మొత్తం వందశాతం మంత్రుల్ని మార్చే విధంగా నిర్ణయం తీసుకుంటే సీనియర్ మంత్రులకు ప్రాంతీయ అభివృద్ధి మండళ్ల పేరుతో వ్యవస్థలను ఏర్పాటు చేసి మూడు జిల్లాలకు ఒక అభివృద్ధి మండలి ఛైర్మన్‌గా నియమించే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. ఏది ఏమైనా కొత్తజిల్లాలు ఏర్పాటైతే తమకు మంత్రి పదవి లభిస్తుందన్న ఆశతో కొంతమంది ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు? అందుకు అనుగుణంగానే ప్రకాశంజిల్లాలో ఎంపీ నియోజకవర్గాల పరిధిలోని జిల్లాలతో ఏర్పడే రెండు జిల్లాలకు ఇద్దరు మంత్రులకు అవకాశం ఉండవచ్చని తెలుస్తోంది. ఈ లెక్కనా.. కొత్తగా ఒంగోలు కేంద్రంగా ఏర్పడే ప్రకాశంజిల్లా నుంచి ఒకరికి మంత్రి పదవి లభించనుంది. నూతన ప్రకాశంజిల్లాలో ఒంగోలు, సంతనూతలపాడు, దర్శి, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం, కొండపి నియోజకర్గాలు ఉండనున్నాయి. ఒంగోలు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల నుంచి మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రివర్గ పునర్వస్తీకరణలో వీరిద్దరు మంత్రి పదవులు కోల్పోతే ఈ రెండు నియోజకవర్గాలను తప్పించి మిగిలిన ఆరు నియోజకవర్గాలనుంచి నలుగురు ఎమ్మెల్యేలు మంత్రి పదవులు ఆశిస్తున్నవారిలో ఉన్నారు. దర్శి నుంచి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, గిద్దలూరు నుంచి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, సంతనూతలపాడు నుంచి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, కందుకూరు నుంచి మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మంత్రి పదవులు ఆశిస్తున్న వారిలో ఉన్నారు? ఇదిలావుంటే, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డికి మంత్రి బాలినేనితో కొంత విబేధాలు ఉన్న మాట వాస్తవమే. ఈ కారణం చేత ఆయనకు మంత్రి పదవి వచ్చే అవకాశం లేదంటున్నారు జిల్లావాసులు. మరోవైపు దర్శి, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు పార్టీలోనే వర్గపోరు తీవ్రంగా ఉంది. దీంతో వారికి మంత్రి పదవులు ఇస్తే ప్రత్యర్థులు తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది. ఇక, మిగిలిన సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు దళిత కోటాలో మంత్రి పదవి ఇవ్వాలంటే ఇటీవల ఆయనపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు అడ్డంకిగా మారాయంటున్నారు. మరి అందరూ అనర్హులైతే ఇక మిగిలింది ఎవరయ్యా అంటే మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి. . ఈయన ఫ్రెషర్ కావడంతో పాటు తండ్రి మార్కాపురం నుంచి గతంలో ఎమ్మెల్యేగా, సీనియర్ పొలిటిషియన్‌గా ఉన్నారు. పిట్టపోరు, పిట్టపోరు పిల్లి తీర్చిన చందంలా అందర్నీ పక్కన పెడితే మార్కాపురం ఎమ్మెల్యేకు మంత్రిగా అవకాశం దక్కే అవకాశాలు లేకపోలేదు. సీఎం జగన్ తీసుకునే నిర్ణయాలు కూడా అనూహ్యంగా ఉంటున్న నేపథ్యంలో ఈ విధంగా కూడా జరగవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రకాశంజిల్లా నుంచి విడిపోయి బాపట్ల జిల్లాలో కలవనున్న మూడు నియోజకవర్గాలు చీరాల, అద్దంకి, పర్చూరు.. వీటిలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం ఇప్పటికే తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి వైసీపీ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ప్రకటించారు. అయితే ఆయన టెక్నికల్ కారణాలతో వైసీపీలో చేరకపోయినా ఆయనకు సీఎం వైఎస్ జగన్ మంత్రి పదవి ఇచ్చి సముచితంగా గౌరవిస్తారన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితంగా మెలిగిన కరణం బలరాంకు టీడీపీ హయాంలో చంద్రబాబు అన్యాయం చేశారన్న విమర్శలు ఉన్నాయి. చంద్రబాబు, వైఎస్ఆర్‌కు సమకాలీకుడిగా ఉన్న కరణం బలరాం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా మంత్రి పదవి చేపట్టేఅవకాశం రాలేదు. చంద్రబాబు కూడా కరణంను మంత్రి పదవికి దూరంగా ఉంచారన్న ఆరోపణలు ఉన్నాయి? ఈ నేపథ్యంలో సియం వైఎస్ జగన్ బాపట్లజిల్లా పరిధిలోకి వచ్చే చీరాల నుంచి ఎమ్మెల్యే కరణం బలరాంకు మంత్రి పదవి ఇచ్చి ఆయన జీవితకాల కలను నెరవేర్చే అవకాశం లేకపోలేదన్న చర్చ కూడా నడుస్తోంది. ఇదే జరిగితే ప్రకాశంజిల్లాలో కమ్మ సామాజిక వర్గానికి పట్టున్న ప్రాంతాల్లో వైసిపికి సానుకూల వాతావరణం ఏర్పడే అవకాశాలు ఉంటాయన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి? మరి ఇవన్నీ ఒక కొలిక్కి రావాలంటే వచ్చే ఉగాది వరకు ఆగాల్సిందే..

# అక్రమ లేఅవుట్ల కు చెక్

విజయవాడ, ఫిబ్రవరి 19 రోజురోజుకూ పెరుగుతున్న రియల్ వెంచర్లు, అక్రమ లేఅవుట్ల కు చెక్ చెప్పేందుకు ఏపీ సర్కారు సిద్ధమైంది. భూ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేలా అనాథరైజ్డ్ రిజిస్ట్రేషన్లపై నిషేధం విధిస్తూ శనివారం ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీటీసీపీ అనుమతి లేని అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయవద్దని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లకు ఆదేశించింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు, లే అవుట్లను ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలకు వెనకాడొద్దని సూచించింది. కాగా ఏపీలోని కొన్ని ప్రాంతాలు అనధికార లే అవుట్లకు అడ్డాగా మారుతున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు నగరాలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు అక్రమదారులు ఎటువంటి అనుమతులు లేకుండా వెంచర్లు, లే అవుట్లు ఏర్పాటు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో వీరికి కొందరు అధికారుల సహకారం కూడా అందుతోందని విమర్శలు వస్తున్నాయి. మరోవైపు అనధికార, అక్రమ లే అవుట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసి సామాన్యులు మోసపోతున్నారు. ఈక్రమంలో అనధికార లే అవుట్లకు చెక్‌పెట్టేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్ని రోజుల క్రితం పట్టణాలు, నగరాలలో, గ్రామాలలో అక్రమ లే అవుట్లను గుర్తించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఇటీవల కలెక్టర్‌లకు, పంచాయితీ రాజ్ కమిషనర్లను ఆదేశించింది. తాజాగా అనధికార లే అవుట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# దేశంలో పెరగుతున్న కోటీశ్వరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్)కరోనా మహమ్మారి కారణంగా ఎంతో మంది ఉద్యోగాలు కోల్పోయారు. అనారోగ్యం బారిన పడడం, ఉ ద్యోగాలు కోల్పోవడం వెరసి ఎన్నో కుటుంబాలు ఆదాయాలు కోల్పోయాయి. అయితే ఓవైపు నిరుద్యోగం పెరిగినా, ప్రజల ఆదాయాలు పడిపోయినా మరోవైపు దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరగడం విశేషం. హురున్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కోవిడ్ సమయంలోనూ గతేడాది (2021) దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరిగినట్లు ఈ సర్వేలో తేలింది. అంతేకాదు రూ. 7 కోట్లకు పైగా సంపద ఉన్న వారి సంఖ్య 2021 డిసెంబర్ నాటికి 4.58 లక్షలకు చేరిందని సర్వేలో వెల్లడించారు. 2020తో పోలిస్తే ఈ సంఖ్య 11 శాతం అధికం కావడం విశేషం. ఇదిలా ఉంటే 2026 నాటికి ఈ సంఖ్య ఏకంగా 30 శాతం పెరిగి, 6 లక్షలకు చేరొచ్చని హురున్ సర్వే అంచనా వేసింది. ఈ విషయమై హురున్ ఇండియా మేనేజింగ్ డైరక్టర్ అనస్ రెహమాన్ మాట్లాడుతూ.. 'రానున్న పదేళ్లలో విలాసవంత బ్రాండ్లకు భారీగా డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయి, ఈ రంగంలోకి అడుగుపెట్టడం లేదా తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవడంపై కంపెనీలు దృష్టి సారించాలని' సూచించారు. ఈ సర్వేలో ఇంకా తేలిన విషయాలు ఏంటంటే.. కోటీశ్వరులు అత్యధికంగా ఉన్న నగరాల్లో 20,300 మందితో దేశ ఆర్థిక రాజధాని ముంబయి మొదటి వరుసలో నిలిచింది. తర్వాత స్థానాల్లో 17,400 మందితో ఢిల్లీ, 10,500 మందితో కోల్‌కతా ఉన్నాయి. ఇక కోట్లు సంపాదిస్తున్న వారిలో 33 శాతం మంది సామాజిక బాధ్యత కోసమే పన్నులు చెల్లిస్తున్నట్లు సర్వేలో పాల్గొన్న వారు తెలిపారు. అలాగే 19 శాతం మంది తాము సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి తిరిగి ఇస్తున్నట్లు తెలిపారు. అత్యధికంగా సంపాదిస్తున్న వారిలో ఏకంగా 66 శాతం మంది తమ పిల్లలను విదేశాల్లో చదివించడానికి ఆసక్తి చూపిస్తున్నారని సర్వేలో తేలింది. వీరిలో ఎక్కువ మంది అమెరికా వైపు మొగ్గు చూపుతున్నారు. ఆ తర్వాత బ్రిటన్, న్యూజిలాండ్, జర్మనీ వైపు ఆసక్తి చూపిస్తున్నారు.

### కొడుకు చేతిలో గాయాపడిన వృద్దురాలిని పరామర్శించిన వాసిరెడ్డి పద్మ

తాడేపల్లి కొడుకు చేతిలో చిత్రహింసలకు గురైన బాధితురాలు నాగమణిని మహిళా కమిషన్ ఛైర్మన్ వాసిరెడ్డి పద్మ పరామర్శించారు. తరువాత అమె మాట్లాడుతూ కన్న తల్లి పట్ల ఇంత దారుణంగా వ్యవహరించి, కొట్టడం దారుణం. వృద్దులు ఎవరూ కూడా కుటుంబానికి భారం కాకుడదనే ప్రభుత్వం నెలకు రూ. 2500 పెన్షన్ అందిస్తుంది. ఇటువంటి దుర్మార్గాలు, దురాఘాతాలు సమాజానికి సిగ్గుచేటు. కన్న తల్లులపై ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే తాట తీస్తాం. నిందుతుడు శేషుపై కఠిన చర్యలు తీసుకుంటాం.

## కోర్టు ధిక్కరణ కేసు

**సి.బెళగల్ ఎమ్మార్వోకు6 నెలల జైలుశిక్ష**

కర్నూలు, ఫిబ్రవరి 20 కోర్టు ధిక్కరణ కేసులో కర్నూలు జిల్లా సి.బెళగల్ ఎమ్మార్వో జె.శివశంకర నాయ్ క్ కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2,000 లు జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే...సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన పింజరి కరీం సాబ్ అదే మండల పరిధిలోని కొత్తకోట గ్రామం సరిహద్దులో సర్వే నెం. 430/ 1 లో 11 ఎకరాల 73 సెంట్ల తన సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భూమికి సంబంధించి మ్యుటేషన్ నిమిత్తమై స్థానిక ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకోగా ఆయన గ్రామ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి కరీం సాబ్ దరఖాస్తును తిరస్కరించారు. ఈ నేపథ్యంలో కరీం సాబ్ తనకు న్యాయం చేయమని కోరుతూ న్యాయవాది చల్లా శివశంకర్ ద్వారా గౌరవ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుకు సంబంధించి ఉన్నత న్యాయస్థానం సి.బెళగల్ ఎమ్మార్వో సంబంధిత రైతు మ్యుటేషన్ కోసం చేసుకున్న దరఖాస్తును తిరస్కరిస్తూ ఇచ్చిన ఆదేశాలు చెల్లవని తీర్పునిస్తూ మ్యుటేషన్ చేయాలని ఆదేశించింది. కాగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం అమలుచేయకపోవడంతో ఎమ్మార్వో శివశంకర నాయక్ కోర్టు ధిక్కరణకు పాల్పడినట్టు ధృవీకరించి ఆయనకు ఆరు నెలల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.2,000 లు జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు వారాలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది.

## సచివాలయంలో కొవిడ్ ఆంక్షలు ఎత్తివేత

**ప్రభుత్వం ఉత్తర్వులు**

అమరావతి సచివాలయంలో కొవిడ్ ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని శాఖల కార్యదర్శులు సచివాలయానికి రావాలని ఆదేశించింది. సచివాలయంలో కొవిడ్ ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని శాఖల కార్యదర్శులూ సచివాలయానికి రావాలని ఆదేశించింది. సచివాలయం నుంచే విధులు నిర్వహించాలని సీఎస్ ఆదేశాల్లో తెలిపారు. ఉన్నతాధికారులూ బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ విధానం పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమావేశాలకూ భౌతికంగా హాజరుకావాలని పేర్కొన్నారు. సీఎస్, మంత్రుల సమీక్షలకూ భౌతికంగానే హాజరుకావాలని తెలిపారు.

# అక్రమ నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

## సిపిఐ పార్టీ నాయకులు

నంద్యాల ఫిబ్రవరి 19, ( విభారె) :- రాష్ట్ర ప్రభుత్వము ను కార్మికుల.కర్షకుల సమస్యలపై నిలదీస్తే వారిని అక్రమంగా నిర్బంధించిన మాత్రాన ఉద్యమాలను ఆపలేరని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్. ఏ ఐ టి యు సి కార్యదర్శి. డి.శ్రీనివాసులు.. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి సోమన్న. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు. భూమిని శ్రీనివాసులు. ఏఐటీయూసీ నాయకులు సుశీలమ్మ. చిన్నమ్మ. నాగేశ్వరరావు. శివలింగం. తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం నాడు విలేఖర్ల సమావేశంలో .వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు తన పాదయాత్రలో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారు . కార్మికుల కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేస్తానని హామీ ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలోని కార్మికులు జీతాలు పెంచాలని వారిని రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన చేపట్టిన పట్టించుకోకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 19వ తేదీ రాష్ట్ర ఏఐటీయూసీ పిలుపుమేరకు విజయవాడ లో జరుగుతున్న ధర్నా కార్యక్రమానికి నంద్యాల ప్రాంతం నుండి 100 మంది కార్మికులు బయల్దేరిన నిర్ణయించుకున్న సందర్భంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె ప్రసాద్ ను. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శిడి.శ్రీనివాసులులను వారి ఇళ్ల వద్ద అక్రమంగా నిర్బంధించి పోలీస్ స్టేషన్లకు తరలించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాలను అణచి వేసే ఆలోచన మానుకుని కార్మికుల కర్షకుల ప్రజల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని సిపిఐ నాయకులు విజ్ఞప్తి చేశారు.




# తెలుగుదేశం పార్టీ వలనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత పెరిగింది...

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిని వెంకటరాముడు




తుగ్గలి ఫిబ్రవరి 19, ( విభారె): తెలుగుదేశం పార్టీ వలనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత పెరిగిందని మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్,రాష్ట్ర టిడిపి కార్యదర్శి బట్టిని వెంకటరాముడు తెలియజేసారు.శనివారం నిర్వహించిన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందమూరి తారక రామారావు గారు టిడిపి పార్టీ ని స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించి ప్రజలందరికీ ఓటు విలువ తెలియజేసిన మహా నాయకుడు నందమూరి తారక రామారావు గారి తరువాత ఆయన బాటలోనే నడుస్తూ నారా చంద్రబాబునాయుడు గారు బీసీలకు ఇంకా మంచిసముచిత స్థానాలు కల్పించి, వారికి రాజకీయ,సామాజికంగా పెరగడానికి కావాల్సిన పథకాలు గాని, అవకాశాలు గానీ కల్పించడం జరిగింది. మరి ఇప్పుడున్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఎంత సేపు ఉన్నా బీసీలకు అణగదొక్కే ధోరణిలో ప్రవర్తిస్తున్నారు. మంచి ప్రాధాన్యత ఉన్న స్థానాలను అగ్రవర్ణాలకు కట్టబెట్టి,బీసీలకు అప్రధాన్యత కలిగిన స్థానాలను ఇస్తూ,ఏదో బీసీలకు మంచి స్థానాలను ఇచ్చినా అని చెప్పుకుంటూ, బీసీలకు అన్యాయం చేస్తున్నాడు.మరి 13 జిల్లాలలో 5 కోట్లతో బీసీ భవనాలను తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబునాయుడు ప్రారంభించారని,కానీ వైయస్సార్ సిపి ప్రభుత్వం వాటిని పునాదులకే పరిమితం చేసి,ఇంతవరకు ఒక్క బీసీ భవనం కూడా పూర్తి చేయకపోవడం వెనక మరి జగన్ బీసీలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో తెలుస్తోందని వారు తెలియజేసారు. వెంటనే బీసీ భవనాలను పూర్తి చేయవలసిందిగా ఈ సందర్భంగా డిమాండ్ చేసారు,అలాగే కులానికి ఒక కార్పొరేషన్ అని చెప్పి కార్పొరేషన్ అయితే ఏర్పాటు చేయడం జరిగింది.ఆ కార్పొరేషన్ ఛైర్మన్ లకు కనీస అవసరాలైన కుర్చీ గాని,నిధులు కూడా లేవు, వారి విధులు కూడా ఏమిటో తెలియదు. ఒక్క ఛైర్మన్ కూడా ఈ రోజు వరకు ఏ కులానికి కూడా సహాయం చేసే పరిస్థితి లేక ఛైర్మన్ నిస్సహాయ స్థితిలో ఆ కులంలో దిష్టిబొమ్మ గా నిలబెట్టడం జరిగింది. ఇటువంటివన్నీ ప్రశ్నిస్తే వెంటనే వారిపై కేసులు దాడులు చేయడం మొదలు పెడుతున్నారు.దాన్ని బీసీలకు తీరనినష్టాలు ఒక్క వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలోనే జరిగింది. భారతదేశ చరిత్రలోనే ఇటువంటి సీఎంను కొనసాగించడం ఎంత మాత్రం సబబు కాదు. బీసీలంతా కలిసికట్టుగా ఆయనను ఓడిస్తూ అలాగే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ను కోరేదొకటే 50% నుంచి 60% వరకు బిసి జనాభా పెరిగిపోయింది.జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ ప్రాధాన్యత, బిసి కుల గణన చేపట్టడం,50% చట్టసభలలో రిజర్వేషన్ కల్పించడం. కేంద్ర ప్రభుత్వ హయాంలో సపరేటు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి మరి తగిన పథకాలు,తగిన నిధులు ఇవ్వడం.బీసీ ల ముఖ్య ఎజెండా బీసీల కుల గణన జరగాలని చంద్రబాబు నాయుడు కేంద్రంలో డిమాండ్ చేయడం,జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాధికారంలో భాగం కావాలని ముఖ్య జెండా అంశం,వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయం.మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో బీసీ సమావేశాలు నిర్వహించి వైసిపి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ఎండగడుతాంవీటినన్నింటిని తప్పక ఆచరణలో చేసినట్లయితే తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున రేపు బీసీలంతా సపోర్ట్ చేసి తిరిగి చంద్రబాబు నాయుడును సీఎం ను చేయడానికి గానీ,టిడిపి పార్టీ జెండా ఆంధ్రప్రదేశ్ లో ఎగరావేయడం కానీ అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ప్రార్థిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె. ఈ.ప్రభాకర్, బిటి నాయుడు,కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు,రాష్ట్ర కార్యదర్శి నరసింహ యాదవ్ ,మాజీ జడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకట్రాముడు,మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణ,తిరుపాల్ బాబు, రాంబాబు, ఎల్లప్ప తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు. బీసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇల్లు నిర్మించేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

బద్వేలు ఫిబ్రవరి 19, ( విభారె). బద్వేల్ మున్సిపాలిటీ ఒకటవ వార్డు సచివాలయంలో జగనన్న గృహ లబ్ధిదారుల సమావేశం...సచివాలయ సిబ్బంది పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతూ పొదుపు లో మీకు ముప్పై వేలు నగదు ఇప్పిస్తాము ఇల్లు నిర్మించుకోండి లేదంటే మీ పట్టాలు మాకు వద్దు అని రిటన్ ఇవ్వవలసిందిగా ఆర్. డి .ఓ. చెప్పారు అని సచివాలయ సిబ్బంది అక్కడున్న లబ్ధిదారులతో చెప్పారుప్రభుత్వం ఇళ్లు కట్టేందుకు టెండర్లు పిలిస్తే ఎవ్వరూ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు అని సచివాలయ సిబ్బంది తెలిపారు... పొదుపు సంఘాల మహిళలు మాత్రం మేము నెలనెలా కట్టుకోలేని స్థితిలో ఉన్నామని అధికారులకు తెలిపారు... అయితే పొదుపు సంఘాల్లో లేని తమ పరిస్థితి ఏమిటని మరికొందరు జగనన్న గృహ లబ్ధిదారులు వాపోతున్నారు ..ఈ విషయంపై పూర్తి సమాచారం కొరకు సచివాలయ సిబ్బందిని వివరాలు అడగ్గా దాటవేశారు...

# ఆర్ ఓ అర్ . కేసులు విచారణ

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాల ఫిబ్రవరి 19 ( విభారె) :- అర్ ఓ అర్ . కేసులను విచారించడం జరిగింది.అని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.శనివారం నంద్యాల సబ్ కలెక్టర్ వారి కార్యాలయం లో సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నంద్యాల రెవెన్యూ డివిజన్ లోని తొమిది అర్ ఓ. అర్. కేసులను రెవిన్యూ కోర్టు లో విచారించడం జరిగింది అని అన్నారు. ఈ కేసులను భూ యాజమాన్య హక్కుల చట్టం 1971.మరియు 1989 నియమావళి ప్రకారం విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు.బనగానపల్లె మండలం పసుపుల గ్రామం నివాసి శకుంతలమ్మ నేను పసుపుల పొలిమేరలో రెండు ఎకరాల 38 సెంట్లు కొనుగోలు చేశాను కానీ ఆన్లైన్లో ఒక ఎకరా 38 సెంట్లు మాత్రమే నమోదైనది దయతో నేను కొనుగోలు చేసిన భూమి మొత్తమును ఆన్లైన్లో నమోదు చేయించాలని కోరారు. .చాగలమర్రి మండలం మద్దూరు గ్రామం నివాసం రామకృష్ణారెడ్డి నా భార్య పేరు పైన ఒక ఎకరా 47 సెంట్లు కొనుగోలు చేశాను కానీ ఆన్లైన్లో ఒక ఎకరా రెండు సెంట్లు మాత్రమే నమోదైనది దయతో నేను కొనుగోలు చేసిన భూమి మొత్తం ఆన్లైన్లో నమోదు చేయించాలి అని కోరినారు స్పందించిన సబ్ కలెక్టర్ గారు భూమి మొత్తాన్ని సర్వే చూపించు ఆన్లైన్లో నమోదు చేయాలని చంద్రశేఖర్ నాయక్ తాసిల్దార్ కు ఆదేశించారు.బండి ఆత్మకూరు మండలం పెద్ద దేవల పురం గ్రామ నివాసి రామ్ రెడ్డి 66 సెంట్ల భూమి కొనుగోలు చేసినారు కానీ ఆన్లైన్లో ఇతరుల పేరు పైన నమోదైనది వారి పేరును తొలగించి నా పేరును చేయగలరని కొరియున్నారు.ఈ కార్యక్రమంలో గడివేముల తహసీల్దార్ నాగమణి . కోయిలకుంట్ల తహసీల్దార్ పుష్ప కుమారి. సబ్ కలెక్టర్ కార్యాలయం వారి తహసిల్దార్ మహమ్మద్ రఫీ .డిప్యూటీ తహసీల్దార్ రామ సంజీవరావు రవీంద్ర ప్రసాద్ . బనగానపల్లి తహశీల్దార్(ల్బ్యాడ్. ఆయా గ్రామాల వీఆర్వోలు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.





# క్రైమ్ గేమ్ మొదలుపెట్టిన అజయ్ దేవగన్



బాలీవుడ్ హీరోలు దక్షిణాది చిత్రాలపై కన్నేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ముందు వరుసలో నిలుస్తున్నారు బాలీవుడ్ హీరో అజయ్ దేవగన్. ప్రస్తుతం ఆయన కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆర్ ఆర్ ఆర్'. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కలిసి నటించిన ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు.ఈ మూవీ మార్చి 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ మూవీలో అజయ్ దేవగన్ ఇద్దరు సూపర్ స్టార్ లకు గురువుగా అత్యంత కీలక పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే.ఇదిలా వుంటే అజయ్ దేవగన్ మరో సౌత్ సినిమాపై కన్నేశారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం -2'. ఈ చిత్రం గత ఏడాది ఓటీటీలో విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. మీనా - అన్సిబా హసన్ - ఏస్తర్ అనిల్ ఆశా శరత్ - సిద్ధిక్ కీలక పాత్రల్లో నటించారు. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'దృశ్యం' చిత్రానికిది సీక్వెల్. ఇదే చిత్రాన్ని తెలుగులో విక్టరీ వెంకటేష్ మీనా జంటగా రీమేక్ చేశారు. ఈ మూవీ కూడా ఓటీటీలో విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది.ఇప్పుడు ఈ మూవీని బాలీవుడ్ లోనూ రీమేక్ చేస్తున్నారు. 2016లో మలయాళ - తెలుగు - తమిళ భాషల్లో రీమేక్ అయి బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'దృశ్యం' చిత్రాన్ని రీమేక్ చేసిన అజయ్ దేవగన్ మళ్లీ దానికి సీక్వెల్ గా వచ్చిన 'దృశ్యం -2' ని కూడా రీమేక్ చేస్తున్నారు. 'దృశ్యం' రీమేక్ లో నటించిన శ్రియ ఇందులోనూ నటిస్తోంది. ఉత్కంఠ భరితంగా సాగే కథా కథనాలతో సాగే ఈ చిత్రాన్ని గురువారం ముంబైలో హీరో అజయ్ దేవగన్ ప్రారంభించారు.ఈ విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియా ఇన్ స్టా గ్రామ్ వేదికగా ఆన్ లొకేషన్ కి సంబంధించిన ఓ ఫొటోని అభిమానులతో పంచుకున్నారు. ఇందులో అజయ్ దేవగన్ విజయ్ అనే పాత్రలో నటిస్తున్నారు. తాజాగా షేర్ చేసిన ఆన్ లొకేషన్ ఫొటోకి ఆసక్తికరమైన ఓ పోస్ట్ చేయడం ఆసక్తికరంగా మారింది. 'విజయ్ మరోసారి తన ఫ్యామిలీని రక్షించుకుంటాడా? ' అంటూ ఈ మూవీ షూటింగ్ మొదలైందని తెలియజేశారు. అభిషేక్ పాథక్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో టాబు కీలక పాత్రలో నటిస్తున్నరు. 'దృశ్యం' చిత్రాన్ని నిశికాంత్ కామత్ కూపొందించారు. అయితే గతేడాది ఆయన మృతి చెందడంతో 'దృశ్యం -2' బాధ్యతల్ని అభిషేక్ పాథక్ కి అప్పగించారు. గురువారం పట్టాలెక్కిన ఈ క్రైమ్ థ్రిల్లర్ మలయాళ తెలుగు భాషల్లో సూపర్ హిట్ గా నిలిచినట్టే బాలీవుడ్ లోనూ బంపర్ హిట్ అవుతుందో లేదో తెలియాలంటే ఈ మూవీ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

# 100 కోట్ల 'రాక్షసుడు 2' పరిస్థితేంటి..?

'ఒక ఊరిలో' సినిమాతో దర్శకుడుగా పరిచయమైన రమేష్ వర్మ.. పలు చిత్రాలకు రచయితగా నిర్మాతగా కూడా వ్యవహరించారు. 'రైడ్' సినిమాతో సక్సెస్ అందుకున్న దర్శకుడు.. 'వీర' 'అబ్బాయితో అమ్మాయి' వంటి చిత్రాలతో ఫ్లాప్స్ మూటగట్టుకున్నారు. అయితే చాలా గ్యాప్ తర్వాత 'రాక్షసుడు' రీమేక్ తో మంచి విజయాన్ని అందుకుని అందరి దృష్టిని ఆకర్షించారు.ఈ నేపథ్యంలో రవితేజ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో 'రాక్షసుడు' నిర్మాతలు "ఖిలాడీ" చిత్రాన్ని సెట్ చేసారు. రిలీజ్ కు ముందు భారీ హైప్ క్రియేట్ చేసిన ఈ సినిమా.. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన తెచ్చుకుంది.. ఆడియన్స్ నుంచి ఫ్లాప్ టాక్ వచ్చింది. డైరెక్షన్ కు కూడా మంచి మార్కులు పడలేదు. దీంతో రమేష్ నెక్స్ట్ సినిమా పరిస్థితి ఏంటనే చర్చ మొదలైంది.ప్రొడ్యూసర్ కోనేరు సత్యనారాయణ 'ఖిలాడీ' నిర్మాణ దశలో ఉన్నప్పుడే రమేష్ వర్మతో "రాక్షసుడు 2" చిత్రాన్ని అనౌన్స్ చేసారు. ఎ స్టూడియోస్ సమర్పణలో హవిష్ ప్రొడక్షన్ బ్యానర్ పై పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని తీయనున్నట్లు ప్రకటించారు. 100 కోట్ల బడ్జెట్ తో హాలీవుడ్ మూవీ లెవల్ లో తెరకెక్కిస్తామని.. పూర్తిగా లండన్ లో చిత్రీకరించబడుతుందని తెలిపారు. అంతేకాదు ఇందులో ఓ స్టార్ హీరో నటిస్తారని మేకర్స్ వెల్లడించారు.అయితే 'ఖిలాడి' రిజల్ట్ తో ఇప్పుడు ఈ 100 కోట్ల ప్రాజెక్ట్ ని రమేష్ వర్మ డీల్ చేయగలరా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సినిమా ఫలితం మీదనే ఎవరి కెరీర్ అయినా ఆధారపడి ఉంటుంది. ఎన్ని హిట్స్ ఇచ్చినా మధ్యలో ఒక ఫ్లాప్ పడితే.. అవకాశాల కోసం ఎదురు చూడాల్సిందే. ఇప్పుడు టాక్ ని బట్టి




చూస్తే.. 'ఖిలాడీ' సినిమా దర్శకుడికి ఆశించిన విజయాన్ని అందించలేదనే అనుకోవాలి.ప్రీ రిలీజ్ బిజినెస్ భారీగా జరగడంతో రమేష్ వర్మకు నిర్మాత కోనేరు కోటి రూపాయలకు పైగా విలువ చేసే కారును బహుమతిగా ఇచ్చారు. మరి ఇప్పుడు సినిమాకు వచ్చిన రెస్పాన్స్ తో 100 కోట్ల బడ్జెట్ తో పాన్ ఇండియా స్థాయిలో తలపెట్టిన 'రాక్షసుడు 2' మూవీని ముందుకు తీసుకెళ్తారా లేదా అని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.'రాక్షసుడు 2' కథ మొదటి భాగం కంటే చాలా ఎగ్జైటింగ్ గా వచ్చిందని గతంలో మేకర్స్ తెలిపారు. ఎక్కువ కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటూ మరింత థ్రిల్లింగ్ గా ఉండబోతోందని అన్నారు. గిబ్రాన్ ను సంగీతం దర్శకుడిగా.. వెంకట్ సి దిలీప్ ను సినిమాటోగ్రాఫర్ గా తీసుకున్నారు. దేవిశ్రీ ప్రసాద్ తమ్ముడు సాగర్ మరియు శ్రీకాంత్ విస్సా కలిసి డైలాగ్స్ రాస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి స్పష్టత ఇస్తారేమో చూడాలి.

# 'గాడ్ ఫాదర్' షెడ్యూల్ కంప్లీట్ చేసిన నయన్!

నయనతార .. సమయాన్ని డబ్బుతో లెక్కగట్టగలిగిన కథానాయిక. ఆమెతో పాటు కెరియర్ ను మొదలుపెట్టిన చాలామంది కథానాయికలు కెరియర్ పరంగా ఒడిదుడుకులను ఎదుర్కుంటూ వెళుతున్నారు. కానీ కెరియర్ ను మొదలుపెట్టిన దగ్గర నుంచి నయన్ వెనుదిరిగి చూసింది లేదు. అవకాశం పోతుందేమోననే ఆందోళనతో తన షరతులను సడలించినదీ లేదు. ఇక ఎంత స్టార్ హీరో అయినా ఆమె డేట్స్ కోసం ఎదురు చూడటమే తప్ప అవకాశాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఆమెకి ఇంతవరకూ రాలేదు.సాధారణంగా కథానాయికలు సినిమా సినిమాకి మరింత గ్లామరస్ గా కనిపించాలనుకుంటారు. ఫలానా స్టార్ హీరో సరసన చేస్తే మరిన్ని అవకాశాలు వస్తాయని భావిస్తారు. అసలు అలాంటి ఆలోచనే చేయవసరం లేని కథానాయికగా నయనతార కనిపిస్తుంది. గ్లామరస్ గా కనిపించే పాత్రలను ఆమె పక్కన పెట్టేసి చాలాకాలమే అయింది. ఇప్పుడు నయన్ ను తీసుకోవడం వలన ఆ పాత్ర ద్వారా ఆమె అందించే నటన .. థియేటర్స్ కి ఆడియన్స్ ను రప్పించగలిగే ఆమె క్రేజ్ మాత్రమే ఆ సినిమాకి కలిసొస్తుంది. తమిళంలోనే వరుస సినిమాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నయనతారను ఏ మాత్రం వీలు కుదిరినా తమ సినిమాల్లో చేయించాలని మలయాళ దర్శక నిర్మాతలు కాచుకుని కూర్చుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఆమె తెలుగు సినిమాను అంగీకరించడమే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే చిరంజీవి 'గాడ్ ఫాదర్'లో చేయడానికి నయనతార ఒప్పుకోవడం విశేషం. చిరంజీవికి గల క్రేజ్ ఒక కారణమైతే ఈ సినిమా దర్శకుడు మోహన్ రాజాతో నయన్ కి గల సాన్నిహిత్యం మరొక కారణమని చెబుతారు.హైదరాబాదులో నయనతారకి సంబంధించిన ఒక కీలకమైన షెడ్యూల్ ము తాజాగా పూర్తి చేయడం జరిగిందని మోహన్ రాజా ట్వీట్ చేశాడు. ఆమెతో కలిసి మూడో సినిమాకి వర్క్ చేసే అవకాశం కలగడం తనకి చాలా ఆనందంగా ఉందని ఆయన చెప్పాడు. ఆ సందర్భంలో నయన్ తో కలిసి దిగిన ఫొటోను పోస్ట్ చేశాడు. ఇంతకుముందు ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'తని ఒరువన్' .. 'వేలైక్కారన్' సినిమాలలో నయన్ నటించింది. ఈ రెండు సినిమాలు కూడా తమిళనాట భారీ విజయాలను అందుకున్నాయి. ఇక 'గాడ్ ఫాదర్' ఈ ఇద్దరికీ హ్యాట్రిక్ హిట్ ఇస్తుందేమో చూడాలి.



# సునీల్ నరైన్ ఊచకోత.. సంబురాల్లో కేకేఆర్

వెస్టిండీస్ ఆటగాడు, కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ప్లేయర్ సునీల్ నరైన్ భీకరమైన ఫామ్‌లో కొనసాగుతున్నాడు. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్ 2022)లో కొమిల్లా విక్టోరియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ విండీస్ ఆల్‌రౌండర్ ఆకాశమే హద్దుగా చెలరేగి బ్యాటింగ్ చేస్తున్నాడు. లీగ్‌లో భాగంగా బుధవారం చటోగ్రామ్ ఛాలెంజర్స్‌తో జరిగిన సెకండ్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో కేవలం 16 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో విధ్వంసకర ఇన్నింగ్స్ (57 పరుగులు) ఆడిన నరైన్.. శుక్రవారం ఫార్చ్యూన్ బారిషల్‌తో జరిగిన ఫైనల్లోనూ అదే తరహాలో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ఫలితంగా అతను ప్రాతినిధ్యం వహిస్తున్న కొమిల్లా విక్టోరియన్స్ జట్టు బీపీఎల్ 2022





ఛాంపియన్‌గా అవతరించింది.ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన నరైన్ 23 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 57 పరుగులు స్కోర్ చేశాడు. దొరికిన బంతిని దొరికనట్లు బాధడమే పనిగా పెట్టుకున్న అతను.. లీగ్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ తక్కువ బంతుల్లో అర్ధ శతకం నమోదు చేశాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్‌కు దిగిన కొమిల్లా జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో ఫార్చ్యూన్ జట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. ఇదిలా ఉంటే, ఐపీఎల్ 2022 సీజన్ ప్రారంభానికి ముందు నరైన్ భీకరమైన ఫామ్ ఉండటంతో కేకేఆర్ ఫ్రాంచైజీ సంబురాల్లో మునిగి తేలుతుంది. ఈ ఏడాది మెగా వేలానికి ముందు కేకేఆర్ అతన్ని 6 కోట్లకు రిటైన్ చేసుకున్న సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**